ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065

NO SMOKING ALCOHOL
SAY NO TO DRUGS

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 64 ఆదివారం 15 - 02 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజిలు : 08 వెల : 6/-
Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 64 Sunday 15 - 02 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

### మంత్రులు,సీనియర్ నేతలతో
## సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- మంత్రులతో జూబ్లీహిల్స్ క్యాంపుకార్యాలయంలో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి
- కార్పొరేషన్లు, మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలపై చర్చ
- మేయర్, ఛైర్మన్ పీఠాల కైవసానికి కార్యాచరణపై నేతలకు దిశా నిర్దేశం
- హంగ్ వచ్చిన పురపాలికలను చేజిక్కించుకునేందుకు ఎలాంటి వ్యూహాలు అనుసరించాలి అనే దానిపై ప్రధానంగా చర్చ
- మేయర్, ఛైర్మన్ పీఠాలు కైవసం చేసుకునేందుకు దిశానిర్దేశం
- ఎక్స్ అఫిషియో ఓటర్ల నమోదుపై ప్రజాప్రతినిధులకు సీఎం సూచనలు



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 15 :** తెలంగాణ మున్సిపల్, కార్పొరేషన్ల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఈ క్రమంలోనే మంత్రులు, సీనియర్ నేతలతో జూబ్లీహిల్స్‌లోని క్యాంపు ఆఫీస్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేషన్లు, పురపాలక సంఘాల ఫలితాలపై చర్చిస్తున్నారు. హంగ్ వచ్చిన పురపాలికలను చేజెక్కించుకునేందుకు ఎలాంటి వ్యూహాలు అనుసరించాలి అనే దానిపై ప్రధానంగా చర్చిస్తున్నారు. మేయర్, ఛైర్మన్ పీఠాలు కైవసం చేసుకునేందుకు సంబంధించిన కార్యచరణపై ఆయన

- మిగతా 2 లో

### తెలంగాణలో రెండు చోట్ల
## జనసేన పార్టీ గెలుపు

- తెలంగాణలో రెండు చోట్ల గెలవడంపై స్పందించిన జనసేన పార్టీ
- జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామన్న జనసేన
- 330కి పైగా అభ్యర్థులు తెలంగాణలో బరిలో నిలిచారన్న జనసేన
- భవిష్యత్తు ఎన్నికల్లో ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతామని వ్యాఖ్య



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 15 :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో రెండు చోట్ల గెలవడం సంతోషకరమని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని జనసేన పార్టీ తెలంగాణ విభాగం ప్రకటించింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో జనసేన ఉనికిని చాటుకున్న విషయం తెలిసిందే. ఆ పార్టీ రెండు చోట్ల విజయం సాధించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలలో 330 పైగా అభ్యర్థులు పోటీలో నిలిచారని తెలిపారు. మంచిర్యాల్ కార్పొరేషన్‌లో 34వ డివిజన్ నుండి జనసేన కార్పొరేటర్ అభ్యర్థి అగ్గు సాగర్ 31 ఓట్ల మెజార్టీతో, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల

- మిగతా 2 లో

### ఇది ట్రైలర్ మాత్రమే..
## అసలు సినిమా ముందుంది




- బీఆర్ఎస్ పార్టీకి కవిత హెచ్చరిక
- తాము రాజకీయ పార్టీగా మారబోతున్నట్లు తెలియగానే బీఆర్ఎస్ ట్రోలింగ్ చేసిందని ఆగ్రహం
- బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికైనా తప్పులను సరిదిద్దుకోవాలని కవిత సూచన
- వడ్డేపల్లిలో ఏఐఎఫ్‌బీ, తెలంగాణ జాగృతి కలిసి విజయం సాధించిందన్న కవిత

## బంగ్లాదేశ్‌లో ఒక స్థానంలో గెలిచిన 'బీజేపీ'

- బీఎన్‌పీతో కలిసి పోటీ చేసిన బంగ్లాదేశ్ బీజేపీ (బంగ్లాదేశ్ జాతీయ పార్టీ)
- భోలా-1 స్థానంలో గెలిచిన అందలీవ్ రెహ్మాన్ పార్థో
- 30 వేలకు పైగా మెజారిటీతో గెలిచిన రెహ్మాన్




## దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుంది

- హస్తం పార్టీపై మోదీ విమర్శలు
- కాంగ్రెస్ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుంది
- అసోంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన
- విపక్ష కాంగ్రెస్ పార్టీపై ప్రధాని ఫైర్
- కాంగ్రెస్ పాలనలో అసోం భయం గుప్పిట్లో ఉండేదని ఎద్దేవా
- అసోంలోని గువాహటిలో జరిగిన ర్యాలీలో మోదీ వ్యాఖ్యానించారు
- కాంగ్రెస్ పార్టీ విస్మరించిన ఈశాన్య ప్రాంతాలకు తాము భక్తితో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు



**వార్త సంధ్య, ఢిల్లీ, ఫిబ్రవరి 15 :** కాంగ్రెస్ ఎల్లప్పుడూ దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనేవారిని, ఈశాన్య ప్రాంతాన్ని భారత్ నుంచి వేరు చేయాలని నినాదాలు చేసేవారిని హస్తం పార్టీ సమర్థిస్తుందని విమర్శించారు. దేశాన్ని విభజించాలనుకునేవారే కాంగ్రెస్ ఆరాధకులుగా మారుతారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ముస్లిం లీగ్ దేశాన్ని విభజించిందని, ఇప్పుడు నేటి కాంగ్రెస్ 'ముస్లిం లీగ్ మావోయిస్టు కాంగ్రెస్'గా మారిందని దుయ్యబట్టారు. అందుకే కాంగ్రెస్ పట్ల అసోం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ర్యాలీలో ఈ మేరకు మోదీ వ్యాఖ్యానిం చారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అసోం ఆకలితో అలమటించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. అలాగే భయం గుప్పిట్లో ఉందన్నారు. అభివృద్ధి కోసం నిధులు

- మిగతా 2 లో

## మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- అసెంబ్లీ లాబీలో మీడియాతో సీఎం మాటా మంతీ
- ఆదాయం తక్కువ-ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వస్తుందన్న సీఎం
- వచ్చే 2-3ఏళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతామని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆదాయం తక్కువ-ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 15 :** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వచ్చే 2-3 ఏళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడ తామన్నారు. వైఎస్సార్సీపీ విధ్వంసం నుంచి కోలుకో వాలంటే ఇంకా సమయం పడుతుందని చెప్పారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో సీఎం మాటా మంతీ నిర్వహించారు. ఇప్పుడిప్పుడే ట్రాక్

- మిగతా 2 లో

### భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల విలువైన హెరాయిన్




- హెరాయిన్ జారవిడిచిన డ్రోన్
- అనుమానిత డ్రోన్ కదలికలను గుర్తించిన స్థానికులు
- డ్రోన్ ఏదో పదార్థాన్ని జారవిడిచినట్లు గుర్తించిన స్థానికులు
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

## అప్పు ఎంత ఉందో చెప్పలేదు

- బడ్జెట్ పై బుగ్గన విమర్శలు
- బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారన్న బుగ్గన
- గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్లు ఉందని వ్యాఖ్య
- వైసీపీ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని వెల్లడి



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 15 :** ఏపీ శాసనసభలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై వైసీపీ నేత, రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఆర్థిక

- మిగతా 2 లో

## చిన్న పత్రికలపై చిన్న చూపు తగదు

- పత్రికలకు ఎంప్యానల్‌మెంట్ తో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలి.
- ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య డిమాండ్
- 17న"ఛలో సమాచార భవన్"కు పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 14 ( వార్త సంధ్య) :** కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ ఉన్న అన్ని పత్రికలకు ఎంప్యానల్‌మెంట్ తో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన "ఛలో సమాచార భవన్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార పౌరసంబధాల కమిషనర్ కార్యాలయం(సమాచారభవన్) ఎదుట జరిగే జర్నలిస్టుల నిరసన కార్యక్రమంలో వివిధ పత్రికల నిర్వహకులు,జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు, చానళ్ళకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్ధతిని తుంగలో తొక్కి పత్రికలకు ఎంప్యానల్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న,మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ స్వరాష్ట్రంలోనే చిన్న మధ్య తరహా పత్రికలకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగుతుందని మామిడి సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా...అనేక పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారనని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మబలికిన పాలకులు మీడియా అక్రెడిటేషన్ ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సందర్భాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే అడ్వర్టయిజ్మెంట్ తో పాటు అక్రెడిటేషన్ ఇచ్చే వారని, ప్రస్తుతం



అడ్వర్టయిజ్మెంట్ల సంగతి దేవుడెరుగు గానీ...కనీసం అక్రెడిటేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వివక్ష కారణంగా స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, దీని వల్ల ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులకు పత్రికల నిర్వహణ భారమవుతుందని అన్నారు. దీనికి తోడు మూలిగే నక్కమీద తాటికాయపడ్డట్టు ఎంప్యానల్‌లో ఉన్న పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించడం చాలా భాదాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి పత్రికకు అక్రెడిటేషన్ కార్డులు గతంలో మాదిరిగా ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆయా పత్రికలకు ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్మెంట్ ఇవ్వాలని, ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రెడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులు,భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## 'సుప్రీం' హెచ్చరిక..!

ఓటర్లజాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ చేసిన న్యాయపోరాటం, అనంతరం కోర్టు వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాలు గమనించినవారికి, ఇకమీదట ఆ అంశంపై ఎవరెంత పోరాడినా పెద్దగా ఫలితం ఉండదని అర్థమైపోయివుంటుంది. మొత్తం సర్‌నే ఆపగలనన్నంత ధీమాతో నల్లకోటు వేసుకున్న మమతాబెనర్జీ స్వయంగా చక్కని వాదనలు చేశారు. తడబడకుండా చెప్పదల్చుకున్నదంతా చెప్పేశారు. న్యాయమూర్తులు పెద్దగా అడ్డుతగలకుండా, అడిగిన కంటే అధిక సమయమే ఇచ్చి, ఆమె వాదన విన్నారు. తన రాష్ట్రంలో సర్ పేరిట సాగుతున్న దుర్మార్గాలు అక్రమాలు ఎన్నెన్ని విధాలో మమత చెప్పినదంతా విన్న న్యాయమూర్తులు ఆమెను ఆవేశపడవద్దని హితవు చెబుతూ, ప్రక్రియ కొనసాగనివ్వాలని, ఎన్నికలసంఘానికి సంపూర్ణ సహాయసహకారాలు అందించాలని ఆదేశించారు. ప్రశాంతంగా ఉండమని అంటూనే కోర్టు ఆమెకు ప్రశాంతత చేకూర్చలేదని విశ్లేషకుల అభిప్రాయం.ఏవైనా ఆదేశాలు అవసరమైతే మేమున్నాం, కానీ, ప్రక్రియకు ఎటువంటి అడ్డంకినీ అనుమతించేది లేదని కోర్టు తేల్చేసింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలూ అర్థం చేసుకోవాలనీ, అవి సర్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నాయో తనకు అర్థం కావడం లేదని కోర్టు అన్నది. ఎన్నికలముందు ఎందుకీ హడావుడి అని అడగాల్సిన కోర్టు, ఓటర్ల రివిజన్ చేపట్టకపోతే నకిలీ ఓట్లను ఎలా తొలగించగలుగుతాం? అని ఆశ్చర్యపోతోంది. ఇక, ఎన్నికల సంఘం అధికారులు పేర్లూ, ఇంటిపేర్లలో అక్షరదోషాలు, వివాహం అనంతరం మహిళల చిరునామాల్లో మార్పులు వంటి చిన్నచిన్న కారణాలతో పెద్దసంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారని, స్థానికత రుజువుచేసుకొనేందుకు సమయం ఇవ్వడం లేదని, దీనివల్ల కోటీ ముప్పైలక్షలమంది ఓటర్లు ప్రభావితం అవుతున్నారని బెంగాల్ ప్రభుత్వం వాదిస్తే, దీనికి పరిష్కారంగా కోర్టు మరోవారం గడువు పొడిగించింది. నిజానికి, ఫిబ్రవరి 14నే తుదిజాబితాను ప్రకటించవలసి ఉండగా, దానికి మరోవారం వరకూ పరిశీలనలు, అభ్యంతరాలకు న్యాయస్థానం అవకాశం ఇవ్వడం మమతకు కాస్తంత ఊరట. మూడువందల మంది అధికారులను కేటాయించమని అడిగితే, బెంగాల్ ప్రభుత్వం 80మందినే ఇచ్చిందని ఎన్నికల సంఘం న్యాయవాది చెప్పుకున్నారు.అవసరమైనంత సిబ్బందిని ఇవ్వాల్సిందిగా ఆదేశించి, మైక్రో అబ్జర్వర్లకు అంతిమ నిర్ణయం చేసే అధికారం లేదని, వారు కేవలం సహాయకులు మాత్రమేనని కోర్టు ప్రకటించడం కూడా మమతకు ఉపశమనమే. అయితే, ఇప్పుడు కొత్తగా రంగంలోకి దిగుతున్న ఎనిమిదిన్నరవేల మందీ అతివేగంగా పరిజ్ఞానాన్ని పెంచుకొని కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఓటర్లకు న్యాయం చేయగలరా అన్న ప్రశ్న ఉండనే ఉంది. రాష్ట్రప్రభుత్వం అధికారులను సమకూర్చనందుకు సర్వోన్నత న్యాయ స్థానంలో అదేపనిగా పోరాడి మమత ప్రభుత్వం మెడలు వంచాల్సిన ఎన్నికల సంఘం, ఎవరో ఒకరితో, ఏదో ఒకరీతిలో, ఎలాగోలా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తిచేయదల్చుకున్నదా? అని కొందరి ప్రశ్న. సర్ ప్రక్రియలో పాల్గొంటున్న అధికారులపై దాడులు జరుగుతున్నాయనీ, వారిని భయపె డుతున్నారని అంటున్న ఎన్నికల సంఘాన్ని ఊరడించడం కోసం డీజీపీనుంచి కోర్టు అఫిడవిట్ కోరింది. సర్వోన్నత న్యాయస్థానం అదనంగా ఓ వారం గడువు పొడిగించినా కూడా ఎన్నికల సంఘం సిబ్బంది తమ లక్ష్యాన్ని గడువులోగా పూర్తిచేయడం కోసం భోజన విరామం కూడా తగ్గించుకొని, కొన్ని గంటలు అధికంగా పనిచేయవలసి వస్తున్నదట. ఆ కాస్త గడువూ పెంచకపోతే ఇంకెంత హడావుడిగా పని జరిగేదో, ఇంకెన్ని లక్షలమందికి అన్యాయం జరిగేదో దేశం గమనించాలని బెంగాల్ మంత్రులు కోరుతు న్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన సమయం సమీపిస్తున్నందున ఎన్నికల సంఘం ఉన్నతాధికారులనుంచి, స్థానిక సిబ్బంది వరకూ ఒత్తిడికి గురవకతప్పదు. సుప్రీంకోర్టులో తనకే విజ యం దక్కిందని తృణమూల్ నాయకులు చెప్పుకుంటున్నారు. ఏవో అల్ప, స్వల్ప సవరణలు మాత్రమే చేసి, మొత్తం సర్ ప్రక్రియను గట్టిగా వెనకేసుకొచ్చి, బలంగా ఎత్తిపట్టినందుకు ఎన్నికల సంఘం తెగ సంతోషిస్తోంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అమలుకాబోతున్న రాష్ట్రా లకు ఈ తీర్పు ఒక హెచ్చరిక.

## అప్పు ఎంత ఉందో చెప్పలేదు

**మొదటిపేజీ తరువాయి** – మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ స్పీచ్ లో అన్నీ అబద్ధాలే చెప్పారని విమర్శించారు. అసెంబ్లీలో అబద్దాలు చెప్పడం పెద్ద నేరమని అన్నారు. ఈ బడ్జెట్ లో కొత్తదనం ఏమీ లేదని... గత బడ్జెట్ బుక్ ను మళ్లీ చదివినట్టే ఉందని చెప్పారు. రాష్ట్ర అప్పు ఎంత ఉందో చెప్పలేదని విమర్శించారు.తమ ప్రభుత్వ హయాంలో 9 శాతం వృద్ధి సాధించామని బుగ్గన చెప్పారు. లక్ష 35 వేల మంది యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తం 10,032 విలేజ్ క్లినిక్ లను ఏర్పాటు చేశామని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 3,700 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. 10,775 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

## బంగ్లాదేశ్‌లో ఒక స్థానంలో గెలిచిన 'బీజేపీ'

**మొదటిపేజీ తరువాయి** – బంగ్లాదేశ్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 'బీజేపీ' ఒక స్థానంలో విజయం సాధించింది. అయితే ఈ 'బీజేపీకి' మన భారతీయ జనతా పార్టీకి ఎలాంటి సంబంధం లేదు. ఆ దేశంలో బంగ్లాదేశ్ జాతీయ పార్టీ (బీజేపీ) ఉంది. ఈ పార్టీ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)కి మిత్రపక్షం కావడం గమనార్హం.భోలా-1 స్థానం నుంచి పోటీ చేసిన బంగ్లాదేశ్ 'బీజేపీ'కి చెందిన అందలీవ్ రెహ్మాన్ పార్థో సమీప ప్రత్యర్థి జమాతే ఇ ఇస్లామీకి చెందిన నజ్రుల్ ఇస్లాంపై 30,226 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రెహ్మాన్ పార్థో 1,05,543 ఓట్లను సాధించారు. 297 స్థానాలకు ఎన్నికలు జరగగా బీఎన్‌పీ, దాని మిత్ర పక్షాలు 212 సీట్లు సాధించి అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. బీఎన్‌పీ సొంతగా 209 సీట్లు సాధించింది. మిత్రపక్షాలు గనోసంహతి ఆందోళన్, బంగ్లాదేశ్ జాతీయ పార్టీ (బీజేపీ), గోనో ఓధికార్ పరిషత్ ఒక్కొక్క సీటు చొప్పున గెలుచుకున్నాయి. జమాత్, మిత్రపక్షాలు కలిపి 77 సీట్లకు పరిమితమయ్యాయి.షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పోటీలో లేకపోవడంతో ప్రధాన పోటీ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, జమాత్ ఏ ఇస్లామీ మధ్య నెలకొంది. ఎన్నికల్లో 50 పార్టీలు తమ అభ్యర్థులను బరిలో నిలిపాయి. 273 మంది స్వతంత్రులు సహా 2,208 అభ్యర్థులు బరిలో నిలచారు. బీఎన్‌పీ అత్యధికంగా 291 స్థానాల్లో అభ్యర్థులను బరిలో దింపింది.

## భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల విలువైన హెరాయిన్



**మొదటిపేజీ తరువాయి** – భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లోని ఆర్ఎస్ పురా సెక్టార్ ప్రాంతంలో రూ.40 కోట్లకు పైగా విలువైన 6.5 కిలోల హెరాయిన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ వీటిని జారవిడిచినట్లు అనుమానిస్తున్నారు. శుక్రవారం రాత్రి అనుమానిత డ్రోన్ కదలికలను స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ డ్రోన్ ఏదో పదార్థాన్ని జారవిడిచినట్లు స్థానికులు వారికి తెలిపారు.దీంతో పోలీసులు బీఎస్ఎఫ్ దళాలతో కలిసి ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. స్థానిక పొలాల్లో పెద్ద ఎత్తున హెరాయిన్‌ను గుర్తించారు. దాని మొత్తం విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, కథువా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా పాక్ నుంచి హెరాయిన్‌ను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు చెందిన జతిన్, కథువాలోని జఖ్‌బార్‌కు చెందిన డానిష్ డోగ్రాలుగా గుర్తించారు. వీరికి పాకిస్థాన్ స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు.

## దేశ భద్రతను ప్రమాదంలో పడేస్తుంది

**మొదటిపేజీ తరువాయి** – ఇవ్వకుండా తప్పించుకునే హస్తం పార్టీ అసోంను అభివృద్ధి చేయగలదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కేంద్రం నుంచి అసోం పన్ను వాటాగా రూ. 10,000 కోట్లు మాత్రమే అందుకునేదన్నారు. ఇప్పుడు బీజేపీ సర్కార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కన్నా 5 రెట్లు ఎక్కువను పన్ను వాటాగా అందుకుంటోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విస్మరించిన ఈశాన్య ప్రాంతాలకు తాము భక్తితో సేవ చేస్తున్నామని పేర్కొన్నారు.

## మంత్రులు, కాంగ్రెస్ సీనియర్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**మొదటిపేజీ తరువాయి** – నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఎక్స్ అఫీషియో ఓటర్ల నమోదుపై ప్రజాప్రతినిధులకు సీఎం సూచనలు చేయనున్నట్లుగా తెలుస్తోంది.

# రూ.3,32,205 కోట్లతో ఏపీ బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి** – కేటాయించారు.వ్యవసాయం-నీటి భద్రత కేటాయింపులు: 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం-నీటి భద్రత కేటాయింపులు చేశారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవ రూ.6,600 కోట్లు, రూ.పోలవరం 6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు.మూలధన వ్యయం పెంపు: మూలధన వ్యయాన్ని గత బడ్జెట్ కంటే ప్రభుత్వం పెంచింది. 2025-26 రివైజ్డ్ అంచనాల్లో మూలధన వ్యయం 39,497.56 కోట్లు ఉండగా, 2026-27 బడ్జెట్ అంచనాల్లో మూలధన వ్యయం రూ.53,915.38 కోట్లు పెంచింది. గత ఏడాది కంటే మూలధన వ్యయాన్ని రూ.14,417.82 కోట్ల మేర ప్రభుత్వం పెంచింది. మూలధన వ్యయం పెంచడం ద్వారా ఆస్తుల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. మూలధన వ్యయానికి ఎక్కువ కేటాయింపులు జరపలేదని గత ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయని మూలధన వ్యయం కేటాయింపుల విషయంలో నాటి వైఎస్సార్సీపీ ప్రభుత్వ విధానాన్ని వివిధ సందర్భాల్లో కాగ్ తప్పు పట్టిందని పయ్యావుల వెల్లడించారు.పన్నుల ద్వారా ఆదాయం: 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో రూపాయి రాక పన్నుల ద్వారా ఆదాయం 38 శాతం, పన్నేతర ఆదాయం 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా 19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ 10 శాతం ఉంది. రూపాయి పోక సంక్షేమం 17 శాతం, విద్య 11 శాతం, ఆర్థికం 8 శాతం, పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం 6 శాతం, జలవనరులు 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ 4 శాతం, విద్యుత్ రంగం 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు 4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు 18 శాతంగా పేర్కొన్నారు.రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు: రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గింది. 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ.41,118.36 కోట్లు ఉండగా, 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.22,002.50 కోట్లు ఉండనుంది. 2025-26 రివైజ్డ్ అంచనాల ప్రకారం ద్రవ్యలోటు రూ.80,567.47 కోట్లు ఉంటే, 2026-27 బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ.75,868.09 కోట్లు ఉండనుంది. న్నుల ద్వారా ఆదాయం 38 శాతం, పన్నేతర ఆదాయం 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా 19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ 10 శాతం రానుంది. సంక్షేమం ద్వారా 17 శాతం, విద్య 11 శాతం, ఆర్థికం 8 శాతం, పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం 6 శాతం, జలవనరులు 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ 4 శాతం, విద్యుత్ రంగం 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు 4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు 18 శాతం జరుగనున్నాయి.ప్రజలకు తెలియాలనే ప్రస్తావించాం: ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వివిధ రకాల చర్యలను బడ్జెట్‌లో మంత్రి పయ్యావుల ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల చెల్లింపులు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఆర్థిక కార్యాకలాపాల పునరుద్దరణ చర్యలను మంత్రి బడ్జెట్లో ప్రస్తావించారు. స్థానిక సంస్థలకు బదలాయించిన నిధులు, అధిక రుణాలపై వడ్డీలను తగ్గించేందుకు జరిపిన సంప్రదింపుల వివరాలను బడ్జెట్లో ప్రభుత్వం పొందుపరిచింది. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు తెలియచేయడం కోసమే వివరాలను బడ్జెట్టులో ప్రస్తావించామని ప్రభుత్వం వర్గాలు తెలిపారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై వడ్డీలు తగ్గించమని వివిధ సంస్థలతో సంప్రదింపులు జరిపామని మంత్రి పయ్యావుల వెల్లడించారు. 12.3 శాతంగా ఉన్న వడ్డీని 9 శాతానికి తగ్గించేలా ఆయా ఆర్థిక సంస్థలను ఒప్పించామన్నారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాల్లో ఇప్పటి వరకు రూ.43,298 కోట్ల మేర రుణాలకు వడ్డీలు తగ్గించాలని సంప్రదింపులు జరిపామన్నారు. సంప్రదింపుల ఫలితంగా ఏడాదికి రూ.327 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. మరో రూ.1.20 లక్షల కోట్లకు వడ్డీ రేట్లు తగ్గించాలని సంప్రదింపులు జరుపుతు న్నామన్నారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల్లో రూ.24,811 కోట్లు చెల్లింపులు జరిపామన్నారు. ఆర్థిక కార్యాకలాపాల పునరుద్దరణకు ఇరిగేషన్, రహదారుల పనుల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రూ.37,030 కోట్లు వ్యయం చేశామన్నారు. పంచాయతీలు, మున్సిపాల్టీల బలోపేతం నిమిత్తం ఇప్పటి వరకు ఫైనాన్స్ కమిషన్ నిధులను రూ.3,797 కోట్ల మేర బదలాయించామన్నారు.స్కీంల పునరుద్దరణకు రూ.18,701 కోట్లు ఖర్చు: గత ప్రభుత్వం నిలిపేసిన కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 85 స్కీంల పునరుద్దరణకు రూ.18,701 కోట్లు ఖర్చు పెట్టామని దీని ఫలితంగా కేంద్రం నుంచి నిధుల విడుదల మరింతగా పెరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పునరుద్దరించడానికి తెచ్చిన వివిధ సంస్కరణలను బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. సాస్కి కింద ఇప్పటి వరకు రూ.6,544 కోట్ల మేర నిధులను వినియోగించుకున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరో రూ.1,438 కోట్లు సాస్కి నిధులను వినియోగించుకునే అవకాశం ఉందని అన్నారు.సంపద సృష్టిలో భాగంగా ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటును మంత్రి పయ్యావుల ప్రతిపాదించారు. రూ.100 కోట్ల కార్పస్‌తో ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ వెల్త్ ఫండ్ ద్వారా దేశంలోని వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులను ప్రభుత్వం పెట్టనుంది. ఈ మేరకు ఏపీ వెల్త్ ఫండ్‌లో భాగస్వాములు కావాల్సిందిగా ప్రైవేట్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నట్టు బడ్జెట్‌లో వెల్లడించారు. వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం చేకూర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది.

బడ్జెట్ స్వరూపం:
బడ్జెట్: రూ.3,32,205 కోట్లు , రెవెన్యూ వ్యయం: రూ.2,56,143 కోట్లు
మూలధన వ్యయం: రూ.53,915 కోట్లు , రెవెన్యూ లోటు: రూ.22,002 కోట్లు
ద్రవ్య లోటు: రూ.75,868 కోట్లు.

# మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం

**మొదటిపేజీ తరువాయి** – ఎక్కుతున్నామని, రాష్ట్రంలో సమస్యలు ఇంకా చాలా ఉన్నాయని తెలిపారు.ఆదాయం తక్కువ-ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వచ్చిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మేనేజ్ చేసుకుంటూ వస్తున్నామన్నారు. వ్యవసాయం నుంచి ఎక్కువ ఆదాయం రావాలని, సేవా రంగంలోనూ ఆదాయం పెరగాలని చెప్పారు. మన రాష్ట్రంలో ఒంగోలు పాలకు, అనంతపురం పండుకు ఎంతో డిమాండ్ ఉందని చంద్రబాబు అన్నారు. ఈ రెండింటి రుచీ మరెక్కడా రాదని వెల్లడించారు. రెండు మూడేళ్ళలో అమరావతికి ఒక రూపు వస్తుందని తెలిపారు. అమరావతి దారుల్ని జాతీయ రహదారికి అనుసంధానిస్తున్నామని, అమరావతికి రాకపోకలు పెరిగి ఆదాయమూ వస్తుందని వివరించారు. అమరావతికి పశ్చిమ బైపాస్ వల్ల యాక్సిస్ పెరిగిందన్న సీఎం, ఇన్నర్ రింగ్, ఔటర్ రింగ్ రోడ్డుతో మరింత పెరుగుతుందని అన్నారు.రాయలసీమ ముఖచిత్రం మార్చింది తామేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌కు రూ.30 వేల కోట్లు కేటాయించడం పట్ల ఎమ్మెల్యేలు అంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఒక్కప్పుడు పశువులకు నీరు కూడా రాయలసీమలో దొరికేది కాదని గుర్తుచేశారు. రాయలసీమకు రైలులో పశుగ్రాసం, నీళ్లు తరలించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. 2014-19 మధ్య రైన్ గన్స్‌తో పంటలను కాపాడాల్సిన పరిస్థితి ఉందన్నారు. అప్పుడే హంద్రీనీవాను సీరియస్‌గా తీసుకున్నామన్న చంద్రబాబు, ఆ ఫలితాలు ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. దేశంలోనే ఉత్తమమైన పండ్లు రాయలసీమ నుంచి వస్తున్నాయని, అక్కడ పండే దానిమ్మకు మంచి డిమాండ్ ఉందని వెల్లడించారు.గతంలో ఉన్నట్లే నిక్కచ్చిగానే ఉంటా: ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్‌లో ఇచ్చే నివేదిక ద్వారా వారిని వారికి అద్దంలో చూపిస్తున్నానని సీఎం తెలిపారు. 95-96 మాదిరిగానే నిక్కచ్చిగా ఉంటానన్న చంద్రబాబు, మారకపోతే వాళ్లకే నష్టమన్నారు. మొత్తం 9 పేరా మీటర్లలో సర్వే చేయించి వారికి నివేదిక ఇస్తున్నానన్నారు. వారికి తెలియని ఇంకొన్ని పేరామీటర్లు కూడా తనవద్ద ఉన్నాయన్నారు. లోకేశ్ తన పని తాను చేస్తున్నానని అన్నారు. నేతలతో మానవీయ



సంబంధం, మోటివేషన్ రెండూ భయం-భక్తీలా ఉండాలని స్పష్టం చేశారు. మంగళగిరి చీరలకు లోకేశ్ బాగా బ్రాండింగ్ కల్పిస్తున్నారని ప్రశంసించారు. బడ్జెట్ వేళ మహిళా ఎమ్మెల్యేలంతా ఒకే రకమైన చీరలతో రావటం ఐక్యతకు నిదర్శనంగా బాగుందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.సామాజిక న్యాయం దిశగా పయనం నుంచి: ఇది 2026-27 సంవత్సరానికి ఒక ఆకాంక్షాత్మక బడ్జెట్ అని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అన్నారు. కేటాయింపులు చేయబడిన బడ్జెట్ సమస్యలను ఈ బడ్జెట్ తీరుస్తుందని తాము ఆశిస్తున్నామని అన్నారు. ఇది ఆర్థిక వివేకాన్ని సాధించడానికి ఒక సూచనగా పేర్కొన్నారు. ఈ బడ్జెట్ మరింత పెరుగుతున్న రుణాన్ని నియంత్రించే అవకాశం ఉందని తెలిపారు. రుణ మార్పిడి, ప్రతిపాదిత పరిష్కార చర్యలు రాష్ట్రాన్ని అధిక పేరుకుపోయిన అప్పు నుంచి బయటపడేస్తా యన్నారు. పరిశ్రమలు పెట్టుబడుల అభివృద్ధికి ప్రయారిటీ మంచి పరిణామమని అన్నారు. సామాజిక న్యాయం దిశగా పయనం మంచి పరిణామమని యనమల రామకృష్ణుడు అభిప్రాయపడ్డారు.దేశ అభివృద్ధికి బడ్జెట్ ఒక ముఖ్యమైన పునాది: ఇది ప్రజా బడ్జెట్, పేదల సంక్షేమ బడ్జెట్, రైతన్నకు మేలు చేసే బడ్జెట్, విద్య, వైద్యానికి ప్రాధాన్యత నిచ్చే బడ్జెట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా సంక్షేమ బడ్జెట్ ఇది. రూ.3,32,205 కోట్ల బడ్జెట్ అని మంత్రి గుమ్మడి సంధ్యరాణి కొనియాడారు. దేశ అభివృద్ధికి బడ్జెట్ ఒక ముఖ్యమైన పునాది అని, ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్ చాలా బాగుందన్నారు. ప్రజలు ఏ నమ్మకంతో చంద్రబాబుని నమ్మి ఓట్లు వేసి అధికారంలోకి తెచ్చారో, ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉందని గర్వంగా చెప్పగలనన్నారు. తన రెండు శాఖలకు కేటాయించిన నిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీ సంక్షేమానికి 9,190 కోట్లు, మహిళా సంక్షేమానికి రూ.4,582 కోట్లు కేటాయించారన్నారు. ఇది సాధారణ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించబడిన సమతుల్యమైన ఆర్థిక ప్రణాళికగా నిలిచిందని తెలిపారు. ముఖ్యంగా రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం అభినందనీ యమ న్నారు. వ్యవసాయ రంగానికి మద్దతుగా సబ్సిడీలు, సాగు నీటి ప్రాజెక్టులు, ఆధునిక సాంకేతికతలను అందించేందుకు చేసిన ప్రకటనలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా పరిశ్రమలకు ప్రోత్సాహ కాలు ఇవ్వడం గొప్ప నిర్ణయంగా పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పన్ను సడలింపులు కల్పించడం వలన కొత్త వ్యాపారాలు ప్రారంభమ వుతాయన్నారు. దీని వల్ల ఉద్యోగ అవకాశాలు పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. విద్య, ఆరోగ్య రంగాలకు అధిక కేటాయింపులు చేయడం కూడా ఈ బడ్జెట్ ప్రత్యేకత అని వివరించారు. పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల అభివృద్ధికి నిధులు కేటాయించడం వలన ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు.ఆరోగ్యకరమైన, విద్యావంతమైన సమాజమే దేశ ప్రగతికి బలమైన ఆధారమని తెలిపారు. మహిళల సాధికారతకు, స్వయం సహాయక సంఘాలకు మద్దతు ఇవ్వడం ద్వారా సమాజంలో సమానత్వాన్ని పెంపొందించే ప్రయత్నం చేయడం ఈ బడ్జెట్ మరో విశేషమన్నారు. ఇది మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని తెలిపారు. మొత్తం మీద ఈ బడ్జెట్ సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్న ప్రగతిశీలమైన ప్రణాళికగా కనిపిస్తుందన్నారు. ప్రతి వర్గానికీ ప్రయోజనం కలిగేలా రూపొందించిన ఈ బడ్జెట్ నిజంగా చాలా బాగుంది అని గర్వంగా చెప్పవచ్చని అన్నారు. ఇది రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముం దుకు తీసుకెళ్తుందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆకాంక్షించారు.

# తెలంగాణలో రెండు చోట్ల జనసేన పార్టీ గెలుపు

**మొదటిపేజీ తరువాయి** – మున్సిపాలిటీలో 14వ వార్డు నుండి 29 ఓట్ల మెజారిటీతో ఆరూరి విజయలక్ష్మి నాగేశ్వరరావు విజయం సాధించారని తెలిపారు.మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలలో పార్టీకి ఓటేసిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల కోసం పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, వీర మహిళలు అందరూ ఎంతో కష్టపడి పనిచేశారని అన్నారు. తక్కువ సమయంలోనే పార్టీ గెలుపు కోసం ఎంతో శ్రమించిన వారందరికీ ఆయన పవన్ కల్యాణ్ తరఫున, రాష్ట్ర నాయకుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ పార్టీ ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ, రెండు చోట్ల గెలవడం సంతోషకరమని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమం స్ఫూర్తితో పవన్ కల్యాణ్ పార్టీని స్థాపించారని పార్టీ రాష్ట్ర నాయకులు రాజలింగం అన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు.పార్టీని మరింత బలోపేతం చేస్తామని సీనియర్ నాయకుడు ఆర్కే సాగర్ అన్నారు. తెలంగాణలో జనసేన బోణీ కొట్టిందని మరో నాయకుడు ప్రేమ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంగా పనిచేస్తామని అన్నారు.




# ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది

**మొదటిపేజీ తరువాయి** – తమ సంస్థ రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించగానే బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు తమను ట్రోలింగ్ చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కానీ తమను లక్ష్యంగా చేసుకున్న వారికి ఒకటే విషయం చెబుతున్నానని, ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని హెచ్చరించారు. ఇప్పుడే తొందరపడి మాట జారవద్దని, తమపై కారుకూతలు కూయవద్దని బీఆర్ఎస్ వారిని హెచ్చరించారు. ఇప్పటికైనా మీ తప్పులను సరిదిద్దుకోవాలని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వారు ఉద్యమకారులను కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, గతంలో 90 శాతం మున్సిపాలిటీలను గెలుచుకున్న బీఆర్ఎస్ ఈసారి 16 స్థానాలకే పరిమితమైందని కవిత గుర్తు చేశారు. ప్రజల మద్దతును ఎందుకు కోల్పోయామో బీఆర్ఎస్ ఆలోచించాలని సూచించారు.ఉత్తర తెలంగాణలో బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ పనిచేసిందని కవిత ఆరోపించారు. ఆ రెండు పార్టీల పొత్తుకు ఇది తొలి మెట్టు అన్నారు. కాంగ్రెస్ పార్టీతో మిలాఖత్ అయిన సీపీఐకి కొత్తగూడంలో బీఆర్ఎస్ పార్టీ మద్దతివ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై సాంబశివరావు చేసిన ఆరోపణలను అంగీకరిస్తున్నారా అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. తెలంగాణలో ప్రత్యామ్నాయం



లేకపోవడం వల్లే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు వేశారని అన్నారు. ఆ లోటును తెలంగాణ జాగృతి భర్తీ చేస్తుందని కవిత పేర్కొన్నారు. బీజేపీ కరీంనగర్‌లో తప్ప ఎక్కడా గెలవలేదని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ రూ.30 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. తమకు 17 స్థానాలు రావడమే చాలా ఎక్కువ అన్నట్లుగా కేటీఆర్ మాట్లాడటం విచిత్రమని కవిత అన్నారు.గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిబంధనలను ఉల్లంఘించారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు.

**వడ్డేపల్లి మున్సిపాలిటీ విజయంపై కవిత**

జాగృతి రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించిన తర్వాత తమ పార్టీకి చెందిన నాయకులు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారని అన్నారు. తక్కువ సమయంలోనే ప్రజలు తమను ఆదరించారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి, ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ కలిసి పోటీ చేసి అద్భుత విజయాన్ని సాధించాయని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తాము 40 వార్డులు గెలుచుకున్నామని అన్నారు.అధికారికంగా 33 స్థానాల్లో తమ అభ్యర్థులు విజయం సాధించారని, మరో 7చోట్ల సాంకేతిక కారణాల వల్ల స్వతంత్రులుగా గెలిచారని వెల్లడించారు. ముఖ్యంగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో తమకు స్పష్టమైన మెజారిటీ వచ్చిందని కవిత వెల్లడించారు.తమ విజయంలో తెలంగాణ జాగృతి ప్రమేయం లేదని ఏఐఎఫ్‌బీ నాయకుడు వడ్డేపల్లి శ్రీనివాసులు నిన్న ప్రకటించారు. అయితే ఈరోజు కవిత ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అంబటి బోజిరెడ్డి, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించడం గమనార్హం. వడ్డేపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ జాగృతి, ఏఐఎఫ్‌బీ కలిసి కైవసం చేసుకున్నాయని కవిత స్పష్టం చేశారు.

# ఎన్టీఆర్ జిల్లాలో కేజీబీవీ ఘటనపై కలెక్టర్ కఠిన చర్యలు

## ప్రత్యేక అధికారిణి సరెండర్

## వసతి గృహాల్లో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశం

**తిరువూరు ఫిబ్రవరి 14 (వార్తసంధ్య ) :** ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) వసతి గృహంలో ఇటీవల చోటుచేసుకున్న ఎలుకల దాడి ఘటనపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించిన అనంతరం సంబంధిత ప్రత్యేక అధికారిణిని ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. శనివారం కేజీబీవీ పాఠశాలను స్వయంగా తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులు మరియు సిబ్బందితో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డార్మెటరీలో 12 మంది విద్యార్థులు ఎలుకల దాడికి గురవడం బాధాకరమని పేర్కొన్నారు. గాయపడిన విద్యార్థులకు తక్షణమే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందించినట్లు తెలిపారు. పాఠశాల డార్మెటరీ వెనుక ఉన్న పాడుబడిన బావి ఎలుకలకు నివాసంగా మారి, రాత్రి వేళల్లో డార్మెటరీలోకి ప్రవేశించేందుకు కారణమైందని



విచారణలో తేలిందన్నారు. గడచిన జనవరి 31 వరకు ప్రత్యేక అధికారిణిగా పనిచేసిన ఎం. శ్యామల అలసత్వాన్ని గుర్తించి, ఆమెను విధుల నుంచి తొలగించి ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు వెల్లడించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. పూడికపడిన డ్రైనేజీ వ్యవస్థను సరిచేసేందుకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఎలుకల నియంత్రణ కోసం బోన్లు ఏర్పాటు చేయడం, డార్మెటరీల చుట్టూ మెష్ ఏర్పాటు చేయడం, గోడ నిర్మాణం చేపట్టడం వంటి చర్యలు ప్రారంభించినట్లు వివరించారు. కేజీబీవీ పర్యవేక్షణ బాధ్యతలను స్థానిక ఎంపీడీవోకు అప్పగించినట్లు తెలిపారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యం, సంక్షేమం విషయంలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా హాస్టల్ సంక్షేమ అధికారులు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కాచి చల్లార్చిన నీటిని వినియోగించడం, మినరల్ వాటర్ ప్లాంట్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, పరిశుభ్రత మరియు పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వసతి గృహాలలో పచ్చదనం, పరిశుభ్రత ఉండేలా చూసుకుంటే విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెరిగి మెరుగైన విద్యాభ్యాసానికి దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ ఎన్. విజయసుందరిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఎ.కొండూరు తహసీల్దార్ ఎన్. అరవింద్, ఎంఈవో కేశవరావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ విజయసుందరి తదితరులు పాల్గొన్నారు.

# 19 వ రోజు డ్రగ్స్‌పై దండయాత్రకు ఘన స్వాగతం పలికిన ఏ కొండూరు ప్రజలు

**తిరువూరు ఫిబ్రవరి 14 (వార్తసంధ్య ) :** యన్ టీ ఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చీమలపాడులో డ్రగ్స్ వ్యతిరేక దండయాత్రకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. లంబాడి ఆడపడుచులు సంప్రదాయ వస్త్రధారణలో రంగుల హారతులతో ముందుకు వచ్చి ఉద్యమానికి మద్దతు తెలిపారు. డప్పుల మోతకు తాళం వేసి నృత్యాలతో ఊరేగింపును ఉత్సాహభరితంగా మార్చారు. కొలాటాల తాళాలు గాలిలో మార్మోగుతుండగా గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. అయితే ఇది సాధారణ స్వాగతం కాదని, డ్రగ్స్ అనే మహమ్మారికి వ్యతిరేకంగా ప్రజల గట్టి సంకల్పమని గ్రామస్తులు స్పష్టం చేశారు. "డ్రగ్స్‌కు నో -- జీవితం మాకు కావాలి!" అంటూ యువత గళమెత్తి తమ వ్యతిరేకతను వ్యక్తం చేసింది. పోలీసులతో భుజం తో భుజం కలిపి సమాజాన్ని రక్షించేందుకు ముందుకు వస్తామని ప్రజలు తెలిపారు. డ్రగ్స్‌కు తలొగ్గే సమాజం కాదని, డ్రగ్స్‌ను తరిమికొట్టే సమాజమని ఈ కార్యక్రమం ద్వారా చీమలపాడు ప్రజలు స్పష్టంగా చాటిచెప్పారు.



# ఈ 5 సంవత్సరాలు కాలనీ అభివృద్ధికి కృషి చేసినందుకు మొద్దు లచ్చి రెడ్డి కి కృతజ్ఞతలు

## సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేస్ 1 సంక్షేమ సంఘం

**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 14:** 5 సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మరియు కాలనీ అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సహకరించినందుకు కాలనీ వాసుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేటర్ గా 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది మరియు కాలనీ అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసినందుకు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రెడ్డి చీమర్ల కాలనీ అధ్యక్షులు, రాం రెడ్డి వెంకటరామిరెడ్డి ప్రధాన కార్యదర్శి,గంజీ కుమార స్వామి సలహాదారు,జి.రాజేశ్వర్, కోషాధికారి బొద్ర మోని, ఆంజనేయులు ఉపాధ్యక్షులు, ఎ.రజనీ సింగ్, సహాయ కార్యదర్శి,సి.మాధవ రెడ్డి, సీనియర్ సిటిజన్ సభ్యులు ఎమరాజ్ సింగ్,సీనియర్ సిటిజన్స్ సభ్యులు పి.రాజేందర్ రెడ్డి ,సహాయ కార్యదర్శి ఇట్టం వెంకట్ రెడ్డి, ప్రచారం కార్యదర్శి రాజ మహేందర్ రెడ్డి, ఈ.సి మెంబర్.తిప్పర్తి అంజల్ రెడ్డి, ఈ.సి మెంబర్ రంగి నేని శ్యాంసుందర్ రావు, ఇ.సి సభ్యులు.శ్రీ జగన్నాథం, కాలనీ సభ్యులు టి.జగన్ మోహన్ , సీనియర్ సిటిజన్ సభ్యులు కే.నరసింహ్మా రెడ్డి, కాలనీ ఆక్టీవ్ మెంబర్ యం భరత్వాజ్, యువజన విభాగం ప్రతినిధి అశోక్ కుమార్, యువజన విభాగం ప్రతినిధి ప్రవీణ్ కుమార్ రెడ్డి,యువజన విభాగం ప్రతినిధి హాని సిద్ధు,అనురాగ్,అనీల్, అరవింద్, ఆదిత్య,యువ రాజు, యువజన



ఆక్టీవ్ మెంబర్లు బిక్షం రెడ్డి, కాలనీ ఆక్టీవ్ మెంబర్ మరియు బిజెపి పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు కిషోర్ కుమార్, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, ఎస్సీ మోర్చా సెక్రటరీ దుర్గాప్రసాద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉండవల్లిలో ఆత్మీయ విందు

## ప్రజాప్రతినిధులతో లోకేష్ సరదాగా..కాసేపు..!!



**తిరువూరు ఫిబ్రవరి 14 (వార్తసంధ్య) :** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల అనంతరం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆహ్వానం మేరకు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు జిల్లాల శాసనసభ్యులు మరియు లోకసభ సభ్యుల కోసం ఆత్మీయ విందు నిర్వహించారు. ఈ విందుకు కొలికపూడి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా హాజరై పాల్గొన్నారు. సౌహార్ద వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, నియోజకవర్గాల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై అనౌపచారికంగా చర్చలు సాగాయి. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ప్రజాప్రతినిధులతో లోకేష్ సరదాగా ముచ్చటిస్తూ సాన్నిహిత్యాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా కొలికపూడి శ్రీనివాసరావు సతీమణి మాధవికి మంగళగిరి పట్టుచీరను ఆడపడుచు కానుకగా అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో ముగిసింది.

# మంత్రి నారా లోకేష్ ఆత్మీయ విందుకు ఎంపీ కేశినేని శివనాథ్ కుటుంబ సమేతంగా హాజరు

## మంత్రి నివాసంలో సకుటుంబ సమేతంగా ప్రజా ప్రతినిధుల ఆత్మీయ కలయిక

**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 14 వార్త సంధ్య :** ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని, విజయవాడ పార్లమెంటు పరిధిలోని ప్రజాప్రతినిధులతో ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నిర్వహించిన ఆత్మీయ విందు సమావేశానికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), సతీమణి కేశినేని జానకి లక్ష్మీ, కుమారుడు కేశినేని వెంకట్ తో కలిసి హాజరయ్యారు.శనివారం మధ్యాహ్నం ఉండవల్లిలోని మంత్రి నారా లోకేష్ నివాసంలో నిర్వహించిన ఆత్మీయ విందు సమావేశం లో ఎంపీ కేశినేని శివనాథ్ కుటుంబసభ్యులతో పాల్గొని, మంత్రి లోకేష్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులతో స్నేహపూర్వకంగా



ముచ్చటించారు. మంత్రి నారా లోకేష్ ఎంపీ కేశినేని శివనాథ్ సతీమణి జానకి లక్ష్మీ కి మంగళగిరి చేనేత చీర బహుకరించారు. అలాగే యువనాయకుడు కేశినేని వెంకట్ తో ప్రత్యేకంగా మాట్లాడి భవిష్యత్ ప్రణాళికలు అడిగి తెలుసుకుని తన సహకారం ఎప్పుడు వుంటుందని తెలిపారు.రాజకీయాలకు అతీతంగా కుటుంబ సభ్యుల బాగోగులు, పిల్లల విద్య, క్రీడలపై చర్చలు సాగిన ఈ కార్యక్రమంలో, అందరూ ఒకేచోట భోజనం చేస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపటం, . తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ ఆత్మీయ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజాప్రతినిధుల మధ్య స్నేహబంధాలను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. మంత్రి లోకేష్ ప్రజాప్రతినిధుల కుటుంబాలతో ఆత్మీయ విందు సమావేశ కార్యక్రమం చేపట్టి ఏపీ రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని కొనియాడుతూ.మంత్రి నారా లోకేష్ లో ఒక రాజనీతిజ్ఞుడు కనిపిస్తున్నాడని ప్రశంసించారు.

# తిరువూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత

## సీపీఐ నేతల డిమాండ్



**తిరువూరు ఫిబ్రవరి 14 (వార్తసంధ్య ) :** తిరువూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శాశ్వత సూపరింటెండెంట్‌ను వెంటనే నియమించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమకారులు కొల్లి అశోక్, పమ్మి రామారావు చేపట్టిన నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటించిన సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె. నాగుల మీరా, పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో గైనకాలజీ, డెంటల్, అనస్తీషియా, పీడియాట్రిక్ వైద్యులను తక్షణమే నియమించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అవసరమైన నిపుణ వైద్యులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే కాలం చెల్లిన ఎక్స్-రే యంత్రాన్ని తొలగించి, ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం ఆటలాడకూడదని, వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సంబంధిత అధికారులూ తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు.

# పాత శివాలయం నగరోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్

## ఆ లయకారుడి కరుణా కటాక్ష వీక్షణాలు ప్రజలందరిపై వుండాలి

## ప్రజలకు ఎంపీ కేశినేని శివనాథ్ మహాశివరాత్రి శుభాకాంక్షలు

**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 14 వార్త సంధ్య :** ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని, విజయవాడ,పశ్చిమ నియోజకవర్గం వన్ టౌన్ లోని పాత శివాలయం లో విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి శ్రీ గంగా పార్వతి సమేత వసంత మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నగరోత్సవ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఆ లయకారుడి కరుణా కటాక్ష వీక్షణాలు ప్రజలందరిపై వుండటంతోపాటు, రాష్ట్రం సుభిక్షంగా వుండే విధంగా శివపార్వతుల అనుగ్రహం వుండాలని ప్రార్థించటం తోపాటు .పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల వద్ద ప్రభుత్వం తరుపున అన్ని శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి, శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి శ్రీ గంగా పార్వతీ సమేత వసంత మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. విజయవాడ పార్లమెంట్ సభ్యులు ఎంపీ కేసినేని శివనాత్ చిన్ని సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు నగర ఉత్సవంలో పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని శివాలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు అనంతరం విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గొర్తి శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ విజయవాడ నగరంలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రారంభం నాటి నుంచి విశ్వబ్రాహ్మణులు మహాశివరాత్రి పర్వదినం ముందు రోజు స్వామివార్లకు నగరోత్సవం నిర్వహిస్తూ ఉండడం ఆనవాయితీగా వస్తోందన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నగరోత్సవ కార్యక్రమానికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ముఖ్యఅతిథిగా విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు జవ్వాది కుర్మాచారి, అధ్యక్షులు గొర్తి శ్రీనివాసచక్రవర్తి, ప్రధాన కార్యదర్శి కడారు వెంకటేశ్వరరావు, కోశాధికారి తరిణి శంకరాంజనేయులు, నగరోత్సవ నిర్వహణ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలతీర్థపు శ్రీనివాస చారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దప్రోలు బ్రహ్మం, ఉపకోశాధికారి కడారు హేమ సుందరం, గొల్లపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ, దుర్గ గుడి డైరెక్టర్ సుఖాసి సరిత, , గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మైలంపల్లి రాజు పశ్చిమ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ, ప్రధాన కార్యదర్శి కుప్పిలి నాగబాబు, పశ్చిమ నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు ఎమ్.చైతన్య, ప్రధాన కార్యదర్శి భోగవల్లి రమేష్, పశ్చిమ



నియోజకవర్గ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తమ్మిన శేఖర్, క్లస్టర్ ఇన్చార్జులు డి.ప్రభు, కొప్పుల గంగాధర్ రెడ్డి, 49వ డివిజన్ ప్రెసిడెంట్ బడుగు వెంకన్న, 52వ డివిజన్ ప్రెసిడెంట్ ఈగల సాంబ, ప్రధాన కార్యదర్శి గోలి శ్రీనివాసరావు, 37వ డివిజన్ ప్రెసిడెంట్ అమరా గోపాలకృష్ణ, 51వ డివిజన్ ప్రెసిడెంట్ కుంచం దుర్గారావు, 50వ డివిజన్ ప్రెసిడెంట్ కుప్పుల అరుణశ్రీ, 53వ డివిజన్ ప్రెసిడెంట్ నందే విజయలక్ష్మీ, టిడిపి నాయకులు నమ్మి భాను ప్రకాష్ యాదవ్, పీతా బుజ్జి, గంటా రాజు, బోగవల్లి నాగబాబు, మోడీ వెంకట రాజు, బాలసాయి, టిడిపి మహిళ నాయకులు మల్లేశ్వరి, పట్నాల భార్గవి, రాజేశ్వరి, ప్రియాంక లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# టేకులపల్లి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం



**టేకులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 14 (వార్త సంధ్య):** టేకులపల్లి శ్రీ భవాని శంకర స్వామి సహిత శ్రీ గోవింద మాంబా సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినం అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడును.తెల్లవారుజాము 4 గంటల నుండి రుద్రాభిషేకములు ఉదయం 10 గంటలకు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ,రాత్రి 9-30 గంటల నుండి శ్రీ భవాని శంకర స్వామి వారి కళ్యాణ మహోత్సవం, అర్ధ రాత్రి 12 గంటలకు లింగోద్భవకాలంలో రుద్రాభిషేకం.భక్తులందరూ పూజా కార్యక్రమాలలో కళ్యాణ మహోత్సవాలలో పాల్గొని ఆ పరమేశ్వరుని అనుగ్రానికి పాత్రులవుతారని మనవి

# సింగరేణి డాకర్ల నిర్లక్ష్యం ఖరీదు. యువకుడు నవీన్ ప్రాణం బలి

## అంబులెన్స్ లో ఎస్కార్ట్ లేకుండా హైదరాబాద్ కు రిఫర్ చేసారు

## ఊపిరాడక మార్గమధ్యంలోనే ప్రాణంవదిలిన వైనం

## సింగరేణి వైద్యం గొప్పలు ప్రచారానికే పరిమితం

**కొత్తగూడెం, ఫిబ్రవరి 14(వార్త సంధ్య) :** సింగరేణి ప్రధార ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా సింగరేణి ఉద్యోగి కుమారుడి ప్రాణం బలి అయింది. సింగరేణి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని ఎమర్జెన్సీ కేసులను సైతం హైదరాబాదులోని పెద్ద ఆసుపత్రుల్లో ఆధునిక చికిత్సలు అందిస్తున్నట్లు యాజమాన్యం ప్రచారం చేయడం తప్ప కార్య రూపంలో శూన్యంగా కనిపిస్తుంది. కొత్తగూడెం 5 షాఫ్ట్ లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగి బాల నాగేశ్వరరావు కుమారుడు నవీన్ (29) స్థానిక వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శనివారం మరణించాడని ఆరోపణలు వస్తున్నాయి. మూడేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నవీన్‌ను తల్లిదండ్రులు కంటికి రెప్పలా చూసుకుంటూ తనయుణ్ణి కాపాడుకునేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. సింగరేణి అందిస్తున్న వైద్యంపై భరోసాతో డాక్టర్ల ప్రతి సూచనలు పాటిస్తూ వస్తున్న ఆ కుటుంబానికి వైద్యుల నిలువెత్తు నిర్లక్ష్యం శరాఘాతంగా మారింది. నవీన్ ప్రాణాలు కోల్పోవడంతో తీవ్ర కడుపుకోతకు గురైన ఆ కుటుంబంతో పాటు ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులు కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున సింగరేణి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. నవీన్ ఆరోగ్యం చేనుంచటంతో ఇక్కడి ప్రధాని ఆసుపత్రి నుంచి హైదరాబాద్ లో చికిత్స కోసం రిఫర్ చేశారు. ఆస్పత్రికి చెందిన అంబులెన్స్ లో తరలిస్తున్న క్రమంలో ఖమ్మం సమీపంలోని పల్లిపాడు వద్ద ఊపిరి ఆడక అంబులెన్స్ లోనే నవీన్ చాలా విషాదంగా మృతి చెందాడు. అత్యవసర పరిస్థితి ఉందని వైద్యులకు తెలిసినప్పటికీ ఆక్సిజన్ ఆపరేటర్స్ ఏర్పాటు చేయలేకపోయారు. దానికి తోడు అంబులెన్స్ లో ఏసీ కూడా పని చేయడం లేదని విమర్శలు. అసలే తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న నవీన్ వెంట కనీసం ఒక వైద్య చికిత్సలో తర్ఫీదు ఉన్న ఎస్కార్ట్ ను పంపించాల్సి ఉంది. బీటెక్ చదువుకున్న నవీన్ కు





ఊపిరితిత్తుల క్యాన్సర్ ఉన్నట్లు తెలుస్తోంది. దానికి తోడు బోన్ క్యాన్సర్ కూడా సంక్రమించినట్లు తెలిసింది. ఇతనికి కీమో చికిత్సలు కూడా పూర్తిస్థాయిలో అందాయి. ఎంతో కొంత కోరుకుంటున్నా దశలో హైదరాబాద్ వైద్యుల సూచన మేరకు హ్యూమానిటీ ఇంజక్షన్లు ఇవ్వాల్సిందిగా సింగరేణి వైద్యులకు సూచనలు చేసారని అయినప్పటికీ నిర్లక్ష్యం చేశారని సచేమీరా ఆ ఇంజక్షన్లు చేయమని వైద్యులు తిరస్కరించినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొడుకును ఎంతో గారాబంగా చూసుకుంటూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలలుగన్న తల్లిదండ్రుల ఆశలను సింగరేణి వైద్యులు తమ నిర్లక్ష్యంతో కడుపుకోతను మిగుల్చారని విమర్శలు వస్తున్నాయి. మూడేళ్లుగా చికిత్స తీసుకుంటున్న నవీన్ ఎంతో కొంత కోరుకుంటున్నారని తల్లిదండ్రులు చెప్తున్నారు. ఇలాంటి క్రిటికల్ కేసుల విషయంలో అంబులెన్స్ ఏర్పటు శాస్త్రీయంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా చాలా నిర్లక్ష్యం చేశారని దీంతో యువకుడి ప్రాణాలు కోల్పోయాడని గుర్తింపు సంఘం నాయకులు వంగ వెంకట్ హుమాయున్ ఆరోపిస్తున్నారు. యువకుడి శవంతో సింగరేణి ఆసుపత్రి వద్ద నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో వీరు మద్దతుగా నిలబడ్డారు. ఎమర్జెన్సీ కేసు విషయంలో అంబులెన్స్ లో సి ఆర్ పి తో పాటు ఆక్సిజన్ ఆన్ చేసి ఉంచాలని ఒక తర్ఫీదు పొందిన సిబ్బంది ఎస్కార్ట్ గా పంపించాల్సి ఉంటుందని నాయకులు వెల్లడిస్తున్నారు. స్థానిక వైద్యులు ఇవేమీ పట్టించుకోకుండా ఘోరమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారని అందుకే యువకుడు నవీన్ ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో లో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి,కేంద్ర కౌన్సిల్ సభ్యులు హుమాయూన్, రాము, రాజేశ్వరరావు, నరేష్, మురళి, రవీందర్, శ్యామ్, పల్నాటి ప్రశాంత్, నాగయ్య, నితిన్, క్రిస్టఫర్, ఎర్రగాని కృష్ణ, ఓం, వాసు, మడిపల్లి శ్రీనివాస్ తాతిదారులు పాల్గొన్నారు.

# తిరువూరులో మెడికల్ మాఫియాకు వ్యతిరేకంగా ధర్నా




**తిరువూరు ఫిబ్రవరి 14 (వార్తసంధ్య ) :** యన్ టీ ఆర్ జిల్లా తిరువూరు రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు తిరువూరులో మెడికల్ మాఫియాకు వ్యతిరేకంగా ఈరోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్యాట్నీ సెంటర్‌లో జరిగిన ఈ ధర్నాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. డ్రగ్స్ కంట్రోల్ బోర్డు మరియు పోలీసు శాఖ సంయుక్తంగా చేపట్టిన "ఆపరేషన్ గరుడ"లో నమోదైన కేసులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వెల్లడిస్తూ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. కేసుల దర్యాప్తు పురోగతిపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వారు పేర్కొన్నారు.డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, అలాంటి మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా సందర్భంగా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమం శాంతియుతంగా ముగిసింది.

# దెబ్బతీసిన రెబెల్స్ - బరిలోకి దిగి సత్తా చాటిన స్వతంత్ర అభ్యర్థులు

**ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయావకాశాలను దెబ్బతీసిన రెబెల్స్**

**జగిత్యాలలో మొత్తం 9 మంది కాంగ్రెస్ రెబెల్స్ విజయం**

**పలు చోట్ల రెబెల్స్ కారణంగా నష్టపోయిన అధికార పార్టీ**



మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో పలు చోట్ల రెబెల్స్ సత్తా చాటారు. తమకు వార్డు సభ్యుడిగా పోటీ చేసేందుకు సీటు కావాల్సిందేనని కొందరు పట్టుబట్టారు. ప్రధాన పార్టీలు ససేమిరా అనడంతో వారు తమ బాధ్యతలను వదులుకుని స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలా పోటీ చేసిన అభ్యర్థులుగా బరిలోకి దిగారు. కొన్నిచోట్ల బీజేపీ మూల్యం చెల్లించుకోక తప్పలేదు. జగిత్యాలలో మొత్తం 9 మంది కాంగ్రెస్ రెబెల్స్ విజయం పతాకం ఎగురవేశారు. వారందరు ఎవరా అని ఆరాతీయగా మంత్రి జీవన్‌రెడ్డి అనుచరులే కావడం గమనార్హం. అక్కడ బీజేపీ రెబెల్స్ మరో ముగ్గురు విజయఢంకా మోగించారు. సూర్యాపేట మున్సిపాలిటీలో 6 మంది, కోదాడలో ముగ్గురు, హుజూరాబాద్‌లో ఇద్దరు, కామారెడ్డిలో ముగ్గురు కాంగ్రెస్ రెబెల్స్ సత్తా చాటారు.నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో 10వ వార్డులో బీఆర్ఎస్ రెబెల్ అభ్యర్థి పోటీ చేశారు. కానీ ఓట్లు చీలి కాంగ్రెస్ అభ్యర్థి షేక్ ఎజాస్, బీఆర్ఎస్ అభ్యర్థిపై కేవలం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. దాంతో బీఆర్ఎస్ నేతలు తలపట్టుకుంటున్నారు.కరీంనగర్ కార్పొరేషన్ 2వ డివిజన్‌లో బీఆర్ఎస్ రెబెల్ కారణంగా అక్కడ ఆ పార్టీ ఓటమికి గురయ్యింది. బీఆర్ఎస్ అభ్యర్థి చంద్రయ్యకు 938 ఓట్లు రెబెల్ అభ్యర్థి దాసరి సాగర్‌కు 1,535 వచ్చాయి. దాంతో అక్కడ 1,703 ఓట్లు పొందిన బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ విజేతగా నిలిచారు.మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో 114 వార్డుల్లో కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థుల కారణంగా రెండు చోట్ల ఓడిపోయింది. ఒకటో వార్డులో కేవలం తొమ్మిది ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి కాంతయ్యపై బీజేపీ అభ్యర్థి సిద్ధార్థ గెలిచాడు. 14 వార్డులో ఇద్దరు కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థులు 290 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి అడ్డగూరి రమేశ్‌కు 111 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థికి 411 ఓట్లు దక్కాయి. కాంగ్రెస్ అభ్యర్థులు వేర్వేరుగా పోటీ చేయడంతో ఓటర్లు సైతం బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపారని కాంగ్రెస్ నేతలు విశ్లేషిస్తున్నారు. జనగామ మున్సిపాలిటీలో 2 స్థానాలు, మహబూబాబాద్ మున్సిపాలిటీలో ఐదు చోట్ల రెబెల్స్ కారణంగా కాంగ్రెస్ నష్టపోయింది.కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపాలిటీలోని 16వ వార్డులో రెబెల్ అభ్యర్థి కారణంగా కాంగ్రెస్ ఒక వార్డును కోల్పోయింది. అక్కడ పురపాలికలోని కాంగ్రెస్ అభ్యర్థికి 250 ఓట్లు దక్కగా రెబెల్‌కు 222 ఓట్లు లభించాయి. ఫలితంగా బీఆర్ఎస్ అభ్యర్థి గజ్జల మహేశ్ కేవలం 13 ఓట్ల తేడాతో గెలిచారు. 17వ వార్డులో కాంగ్రెస్ తరఫున ఇద్దరు తిరుగుబాటు అభ్యర్థులు పోటీలో నిలిచారు. దాసరి స్వరూపకు 174 ఓట్లు, దాసరి గంగా జమునకు 80 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థిని షబానా షర్వీన్‌కు 232 ఓట్లు వచ్చాయి. ఫలితంగా ఆమెపై ఇండిపెండెంట్ అభ్యర్థిని ఫర్హానాజ్ 23 ఓట్లతో సత్తా చాటింది.ఇల్లెందు మున్సిపాలిటీలో 24 వార్డులో దాదాపు 19 స్థానాలు కాంగ్రెస్ బరిలో నిలిచింది. 3 వార్డుల్లో బీఆర్ఎస్, రెండు చోట్ల ఇద్దరు స్వతంత్రులు సత్తా చాటారు. అయితే ఇక్కడ స్వతంత్రుల్లో ఒకరు కాంగ్రెస్ రెబెల్. మొత్తం మీద ఇక్కడ అధికార పార్టీకి కనీస పోటీ ఇవ్వలేకపోయింది. మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరటం, అభ్యర్థుల ఎంపికలో లోటుపాట్ల కారణంగా బీఆర్ఎస్ భారీ మూల్యం చెల్లించుకుంది.మొత్తం మీద రెబల్స్ ఎఫెక్ట్ అన్ని పార్టీల మీద కనిపించింది. అధికార పార్టీనే కాకుండా అటు విపక్షమైన బీఆర్ఎస్, బీజేపీలకు అసంతృప్తుల సెగ గట్టిగానే తగిలింది. పార్టీ జెండాలు మోసిన తమకు టికెట్ ఇవ్వకుంటే గెలుపోటములను ఎలా ప్రభావితం చేస్తామో రెబల్స్ అన్ని పార్టీలకు రుచి చూపించారు.

# మున్సిపల్ ఎన్నికలు.. ఎక్స్అఫీషియో ఓటుపై ఈసీ స్పష్టత.. ఎవరు ఎక్కడ వేయాలంటే..!

**30కి పైగా మున్సిపాలిటీల్లో హంగ్**

**ఎమ్మెల్యేలు, లోక్ సభ సభ్యులు నియోజకవర్గంలోని ఒక మున్సిపాలిటీలో ఓటు వేయాలన్న ఈసీ**

**రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు ఓటు హక్కు ఉన్న ప్రాంతంలో ఓటు వేయాలన్న ఈసీ**




తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 30కి పైగా మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి మెజార్టీ రాలేదు. దీంతో అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. కౌన్సిలర్లను క్యాంపులకు తరలించారు. పలు మున్సిపాలిటీలలో ఎక్స్అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఈ క్రమంలో ఎక్స్అఫీషియో ఓటుపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది.ఎమ్మెల్యేలు, లోక్ సభ సభ్యులు తమ నియోజకవర్గ పరిధిలో ఏదైనా ఒక మున్సిపాలిటీలో ఎక్స్అఫీషియో ఓటు వేయవచ్చునని వెల్లడించింది. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు తమకు ఓటు ఉన్న మున్సిపాలిటీలోనే ఎక్స్అఫీషియో ఓటును వినియోగించుకోవచ్చని తెలిపింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఎక్స్అఫీషియో ఓటు నమోదుకు నేటి వరకు ఎన్నికల సంఘం గడువు ఇచ్చింది.తెలంగాణలోని 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. నిన్న ఫలితాలు వెలువడగా మూడు కార్పొరేషన్లు, 66 మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ, 13 మున్సిపాలిటీలను బీఆర్ఎస్, కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ దక్కించుకున్నాయి. స్వతంత్రులు లేదా ఇతరులతో కలిపి నిజామాబాద్ కార్పొరేషన్‌ను కూడా బీజేపీ దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. 37 మున్సిపాలిటీల్లో హంగ్ వచ్చింది.ఏడు కార్పొరేషన్లకు మేయర్లు, డిప్యూటీ మేయర్లు, 116 మున్సిపాలిటీలకు ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ పదవులకు ఈ నెల 16న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఎన్నికల్లో పాల్గొనాలని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో పాటు ఎక్స్అఫీషియో సభ్యులు, పార్టీల అధ్యక్షులకు సమాచారం ఇవ్వాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. హంగ్ ఉన్నచోట ఎక్స్అఫీషియో ఓటు కీలకం కానున్న నేపథ్యంలో ఈసీ స్పష్టతనిచ్చింది.

# ఇల్లందు పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం

**ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య**



**ఇల్లందు ప్రతినిధి, ఫిబ్రవరి 14 (వార్త సంధ్య) :** ఇల్లందు పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 19/24 వార్డుల్లో విజయం సాధించిన సందర్భంగా, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య , కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనముల రేవంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి ఎమ్మెల్యే కోరం కనకయ్య ని అభినందించారు.

# పోక్సో కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 14 :** మల్కాజిగిరి సిటీ కమిషనరేట్ , నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధి లొ 2021 సంలొ నమోదైన పోక్సో కేసులో ఈ తీర్పు వెలువడింది. నాగోల్ లోని బీరప్ప టెంపుల్ జైపూరీ కాలనీకి చెందిన పశువుల అంకిత్ (23) అనే వ్యక్తి మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించిన ఘటన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్రాక్ కోర్టు పూర్తి ఆధారాలను పరిశీలించి నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. అదనంగా రూ.10 వేల జరిమానా విధిస్తూ, బాధితురాలికి రూ.1 లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం న్యాయమూర్తి పద్మావతి తీర్పు వెల్లడించారు. పిల్లలపై లైంగిక వేధింపుల కేసుల్లో కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# వనస్థలిపురం గౌతం పబ్లిక్ స్కూల్లో అద్భుత విజ్ఞాన ప్రదర్శన



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 14 :** ఆనంద పరవశులయిన విద్యార్థులు విద్యార్థులలో విజ్ఞానం పెంచేందుకు చదువు ఒకటే మార్గం కాదని, అద్భుత ప్రదర్శనలతో వారిలో నైపుణ్యతను మెరుగుపరిచే విధంగా చూపవచ్చని గౌతమ్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం నిరూపించింది. దానికి కార్యరూపం దాల్చి ఆకాశంలో జరిగే వింత అనుభూతిని విద్యార్థుల కళ్ళకు కట్టినట్లు చూపించే విధంగా పాఠశాలలోనే మినీ ప్లానిటోరియం ఏర్పాటు చేశారు. మెరైన్ వాటర్, డైనోసార్, సోలార్ సిస్టం లాంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా అద్భుత విజ్ఞాన ప్రదర్శన ప్రదర్శించారు. గతంలో వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాల యాజమాన్యం హైదరాబాదులోని బిర్లా ప్లానిటోరియం తీసుకు వెళ్లేవారు. అటువంటి సైన్స్ విజ్ఞాన ప్రదర్శన ను తిలకించిన విద్యార్థులు ఆనంద పరవశులయ్యారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజా నేత 'గుమ్మడి'కి అరుదైన గౌరవం



**టేకులపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 14 (వార్త సంధ్య) :** బీ ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యకు అరుదైన గౌరవం దక్కింది. చెన్నైలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆయన ప్రజా సేవను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసింది. రాజకీయాల్లో నిరాడంబరతకు, నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచే గుమ్మడి నరసయ్య ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఇప్పటికీ సామాన్య జీవితాన్ని గడుపుతూ ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఈ పురస్కారం లభించడం పట్ల నియోజకవర్గ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక నూతన ఒరవడి..ఆత్మీయతతో కూడిన నాయకత్వం!



**కృష్ణాజిల్లా బ్యూరో ఫిబ్రవరి 14 వార్త సంధ్య :** ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని కూటమి నేతలు, ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్య, ఐటీ, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారు తన ఉండవల్లి నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు కార్యక్రమం ఒక మరపురాని అనుభవంగా మిగిలిపోయింది. స్వయంగా లోకేష్ అందరినీ స్వాగతం పలకడం, ప్రతి ఒక్కరితో ఆత్మీయంగా మాట్లాడుతూ కుటుంబ సభ్యులను పరిచయం చేసుకోవడం, సరదాగా గడుపుతూ భోజనం పంచుకోవడం -- ఇవన్నీ కేవలం రాజకీయ సమావేశం కాకుండా, ఒకే కుటుంబ సభ్యులుగా భావించేలా చేశాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని, ఈ అపూర్వమైన ఆత్మీయతను అనుభవించారు."ఇంతటి ఆత్మీయత పంచే నాయకులతో పార్టీ ప్రయాణం చేయడం నా ఆనందం, అదృష్టంగా భావిస్తున్నాను" అని తంగిరాల సౌమ్య తెలిపారు. ఇది కేవలం ఒక విందు కాదు రాజకీయాల్లో కుటుంబ బంధాలు, సమన్వయం, ఆత్మీయతను పెంపొందించే ఒక వినూత్న సంప్రదాయం!బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోకేష్ ప్రారంభించిన ఈ "డిన్నర్ డిప్లొమసీ" రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చరిత్ర సృష్టిస్తోంది. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వారి కుటుంబాలు ఒకే వేదికపై ఆత్మీయంగా కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసే దిశగా ఇది ఒక మంచి అడుగు. ఇలాంటి నాయకత్వం.ఇలాంటి ఆత్మీయత.. ఆంధ్రప్రదేశ్‌కు మరింత బలమైన భవిష్యత్తును తెస్తుందని ఆశిస్తున్నాం!

# మహా శివరాత్రి సందర్భంగా శ్రీ దుబ్బ రాజరాజేశ్వర స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్ దంపతులు





**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఫిబ్రవరి 14(వార్త సంధ్య) :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల కోనాపూర్ గ్రామంలో వెలసిన శ్రీ దుబ్బ రాజరాజేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవానికి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దంపతులు హాజరై పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు కలెక్టర్ దంపతులను ఆశీర్వదించి శాలువాతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. దుబ్బ రాజన్న ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కల్యాణవేదికపై శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని జిల్లా కలెక్టర్ దంపతులు మరియు విశేషంగా హాజరైన భక్తులు తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ ఆధ్యాత్మిక శాంతి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మరియు శివపార్వతుల దివ్య ఆశీస్సులు జిల్లా ప్రజలందరికీ కలగాలని ఆకాంక్షించారు జాతరకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, శానిటేషన్, పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, భక్తుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకొని సురక్షిత త్రాగునీటి సౌకర్యం సమృద్ధిగా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందరు అధికారులు సమన్వయంతో పని చేస్తూ భక్తులందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆలయ ఈవో అనూష ,ఎమ్మార్వో వహీద్, ఎంపీడీవో సలీం, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం, పీసీసీ, సీపీఐ నేత పల్లా చర్చలు సఫలం

**కొత్తగూడెం మేయర్ పీఠంపై వీడిన పీటముడి**

**కాంగ్రెస్‌సీపీఐ పొత్తుతో మేయర్ పీఠం కైవసం చేసుకోవాలని నిర్ణయం**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 14(వార్త సంధ్య) :** మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పీఠంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మరియు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మధ్య జరిగిన కీలక చర్చలు సఫలమయ్యాయి. ఈ చర్చల ఫలితంగా కాంగ్రెస్‌సీపీఐ పొత్తు కొనసాగిస్తూ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని నిర్ణయించారు. పొత్తు ఒప్పందం ప్రకారం మేయర్ పదవిని సీపీఐకు అప్పగించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం అంగీకరించింది.అలాగే డిప్యూటీ మేయర్ పదవిని కాంగ్రెస్ పార్టీకి కేటాయిస్తూ స్పష్టమైన అవగాహనకు వచ్చినట్లు సమాచారం. దీంతో మేయర్ పీఠంపై నెలకొన్న అనిశ్చితి తొలగి, పొత్తు పార్టీల మధ్య సమన్వయం మరింత బలపడినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ నిర్ణయంతో కొత్తగూడెం రాజకీయాల్లో కొత్త సమీకరణాలు రూపుదిద్దుకుంటుండగా, అధికార కూటమి వ్యూహాత్మకంగా ముందడుగు వేసిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# నూతన సి అండ్ ఎండి నీ కలిసిన ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి నాయకులు



**హైదరాబాద్/సింగరేణి, ఫిబ్రవరి 14 (వార్త సంధ్య):** హైదరాబాదులోని సింగరేణి భవన్ లో శనివారం ఉదయం సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బుద్ధప్రకాష్ జ్యోతి, ఐఏఎస్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య ,జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు కందికట్ల వీరభద్రయ్య, వైవి రావు, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య మరియు షేక్ బాజీ సైదా,తాతిదారులు పాల్గొన్నారు.

# తీశారు వదిలేశారు!

**జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం**

**దుర్వాసనతో నిండిన వివేకానంద బస్ స్టాప్**



**ఎల్బీనగర్ ప్రతినిధి, ఫిబ్రవరి ఫిబ్రవరి 14 ( వార్త సంధ్య) :** ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని గడ్డి అన్నారం డివిజన్ పరిధిలో ఉన్న వివేకానంద బస్ స్టాప్ వద్ద జిహెచ్ఎంసి సిబ్బంది నిర్లక్ష్యం బయటపడింది. ఈ ప్రాంతంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది డ్రైనేజీ లోని చెత్తను మిషనరీ ద్వారా బయటకు తీసి, అదే ప్రదేశంలో వదిలేసి వెళ్లిపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.డ్రైనేజీ నుంచి తీసిన మురుగుపై బ్లీచింగ్ చేయకపోవడంతో పరిసర ప్రాంతమంతా భరించలేని దుర్వాసనతో నిండిపోయింది. ముఖ్యంగా రోజూ వందలాది మంది ప్రయాణించే వివేకానంద బస్ స్టాప్ వద్ద ఈ పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.మ్యాన్ హోల్ లేదా డ్రైనేజీ క్లీన్ చేసిన వెంటనే చెత్తను తొలగించి శానిటేషన్ చర్యలు చేపట్టాల్సి ఉండగా, అలా చేయకపోవడం వల్ల ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, సంక్రమణ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.ఇలాంటి నిర్లక్ష్య చర్యలు సిబ్బందికి పరిపాటిగా మారాయని, సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, వివేకానంద బస్ స్టాప్ పరిసరాలను తక్షణమే శుభ్రం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# 'ఆహ్లాదకర వాతావరణంలో ఆత్మీయ విందు'

**నేతల కుటుంబాలతో లోకేశ్ సరదా సంభాషణలు**

**2వ రోజు చిత్తూరు, అనకాపల్లి జిల్లాల కూటమి నేతలతో మంత్రి లోకేశ్ సమావేశం**

**ఆహ్లాదకర వాతావరణంలో నేతలతో ఆత్మీయ విందు**

**హోదాలతో సంబంధం లేకుండా అందరితో సరదా సంభాషణలు**



చంద్రబాబుతో రాజకీయ సమీక్ష అంటే పార్టీ నేతలకు భయం, ఆత్మీయత అంటే బలం. ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ కొత్త సంస్కృతికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు నాంది పలికారు. నియోజకవర్గాల వారీగా సర్వేలను ఆధారంగా చేసుకుని ఎమ్మెల్యేల పనితీరు గురించి చంద్రబాబు చర్చిస్తున్నారు. అదే వేదికపై రాజకీయాల్ని పక్కన పెట్టి నేతల కుటుంబ సభ్యులతో ఆత్మీయ విందుల్లో యోగక్షేమాలను లోకేశ్ తెలుసుకుంటున్నారు. పార్లమెంట్ స్థానాల వారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జరుగుతున్న ఈ సమీక్షలు కేవలం పనితీరు అంచనాలే కాకుండా పార్టీకి దిశానిర్దేశం చేసే వ్యూహ రచనలకు, దారి తప్పే నేతలకు గట్టి హెచ్చరికగా, కట్టుబాటుతో ముందుకు సాగే వారికి ప్రోత్సాహంగా నిలుస్తున్నాయి. క్రమశిక్షణ, ఆత్మీయతతో ఐక్యత ధోరణితో తెలుగుదేశం అధిష్ఠానం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది.ప్రజా ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయానికి కొత్త దిశా నిర్దేశం చేస్తూ పాలనకు వేగం జోడించే కార్యాచరణను అమలు చేస్తున్న చంద్రబాబు మరోసారి తన ప్రత్యేక పరిపాలనా ముద్రను చాటుతున్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ప్రతి రోజూ ఒక జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తూ స్థానిక సమస్యల సత్వర పరిష్కారానికి స్పష్టమైన మార్గదర్శకత్వం ఇస్తున్నారు. సంక్షేమంఅభివృద్ధి కార్యక్రమాల అమల్లో కూటమి ప్రభుత్వ ముద్ర స్పష్టంగా కనపడేలా, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పెరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై లోతైన చర్చలు చేపట్టారు. సీఎం సమావేశాల అనంతరం అదే జిల్లా నేతలతో నారా లోకేశ్ నిర్వహించే డిన్నర్ మీటింగ్‌లు ఆత్మీయతను పెంచి, సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి.వ్యక్తిగతంగా ఎదురెళ్లి స్వాగతం: 'అభిమాన ఆహ్వానం – ఆత్మీయ ఆతిథ్యం' నినాదంతో రాజకీయాలకు అతీతంగా కుటుంబ బంధాలను బలపరుస్తూ సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో చిత్తూరు, అనకాపల్లి పార్లమెంటు కూటమి ప్రజాప్రతినిధులు వారి కుటుంబసభ్యులతో సమావేశమయ్యారు. వ్యక్తిగతంగా వారికి ఎదురెళ్లి స్వాగతం పలికి ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. స్పీకర్, మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు అన్న తేడా లేకుండా కుటుంబసభ్యుల్లా కూర్చొని సరదా సంభాషణలతో గడిపారు.రాజకీయ సమీకరణాలకు మించి మానవీయ అనుబంధానికి ప్రతీకగా ఈ సమావేశం నిలిచింది. ప్రజాప్రతినిధులు అందచేసిన వినతుల ప్రగతి ఏ దశలో ఉందో నివేదిక రూపంలో స్వయంగా అందచేస్తూ సమస్యల పరిష్కారంపై తన నిబద్ధతను లోకేశ్ చాటారు. మహిళలకు మంగళగిరి పట్టుచీరలు కానుకగా అందించి ఆతిథ్యానికి ప్రత్యేక ముద్ర వేశారు. విందు అనంతరం అతిథులందరినీ గేటు వరకూ సాగనంపారు. నేతల మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంచిన ఈ సమావేశం, కూటమి బంధాలను బలోపేతం చేసే ఆత్మీయ రాజకీయానికి చిరునామాగా నిలిచింది.హాజరైన 2 జిల్లాల నేతలు: ఈ ఆత్మీయ సమావేశానికి అనకాపల్లి జిల్లా నుంచి ఎంపీ సీఎం రమేష్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామక్రిష్ణ, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌లు హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల వల్ల పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ఈ సమావేశానికి హాజరుకాలేకపోయారు. అలానే చిత్తూరు జిల్లా నుంచి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్, జిడి నెల్లూరు ఎమ్మెల్యే వీఎం థామస్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణిప్రసాద్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు కుటుంబసభ్యులతో కలిసి హాజరయ్యారు.

# శ్రీశైలం ఘాట్ రోడ్డులో రాత్రివేళల్లోనూ వాహనాలకు అనుమతి

**అటవీ శాఖ పటిష్ట భద్రత చర్యలు**

**వన్యప్రాణులకు ఎలాంటి హాని కలగకుండా వాహనాలు జాగ్రత్తగా నడపాలని అటవీశాఖ సూచనలు**

**నిబంధనలు అతిక్రమిస్తే చోదకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలు**

**4 రోజుల పాటు రాత్రి సమయంలోనూ వాహనాల రాకపోకలకు అనుమతి**



శ్రీశైలం మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శివరాత్రి రోజున మల్లికార్జున స్వామి ఆలయానికి చేసే ప్రత్యేక పాగాలంకరణ కోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వెళ్లే భక్తులకు పెద్దదోర్నాల-శ్రీశైలం ఘాట్ రహదారిలో రాత్రి సమయాల్లో వాహనాలు వెళ్లేందుకు అటవీ శాఖ అనుమతులు ఇచ్చింది.

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు :** ఈనెల 13 నుంచి 16 వరకు రాత్రి వేళల్లోనూ వాహనాల రాకపోకలు సాగించవచ్చని తెలిపింది. ఈ రహదారి పులుల అభయారణ్యం కావడంతో సాధారణ రోజుల్లో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల రాకపోకలు నిలిపేస్తారు. ప్రస్తుతం స్వామి వారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా నాలుగు రోజుల పాటు రాత్రి సమయంలో కూడా వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చారు. వన్యప్రాణులకు ఎలాంటి హాని కలగకుండా వాహనాలు జాగ్రత్తగా నడపాలని, నిబంధనలు అతిక్రమిస్తే చోదకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.మరోవైపు శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈనెల 13 నుంచి 16 వరకు దేవస్థానం, అటవీశాఖ టోల్ గేట్ల వద్ద రుసుం మినహాయింపునిస్తున్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. రాత్రి వేళల్లోనూ రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందని ఆమె చెప్పారు. అదే విధంగా నంద్యాల నుంచి శ్రీశైలం మార్గంలో ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు నడుస్తోందని అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ తరఫున 1,800, తెలంగాణ నుంచి 1,000, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కలిపి మొత్తం 3,000 బస్సులు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు, భద్రతా ఏర్పాట్లకు భక్తులు సహకరించాలని కలెక్టర్ వివరించారు.మహాశివరాత్రి వేడుకల్లో పాగాలంకరణకు ప్రత్యేక విశిష్ట: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాగాలంకరణ ప్రత్యేకమైంది. శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ విమాన గోపురం ముఖ మండపాల నందులకు పాగాలంకరణ చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. బాపట్ల జిల్లా హస్తినాపురం గ్రామానికి చెందిన చేనేతలు పాగాలంకరణ క్రతువు చేపట్టడం సాంప్రదాయంగా వస్తుంది.స్వామివారి కల్యాణానికి ముందు పాగాలంకరణ: కొన్ని ఏళ్ల క్రితం పృథ్వీ వెంకటేశ్వర్లు అనే వృద్ధుడు పాగాలంకరణ చేసేవారు. ఆయన శివైక్యం తర్వాత తన కుమారుడు పృథ్వీ సుబ్బారావు సోదరులతో కలిసి తయారు చేశారు. భక్తిశ్రద్ధలతో చేనేత మగ్గాల ద్వారా నూలుతో కూడిన పాగ వస్త్రం తయారీ కార్తీక మాసం నుంచి మొదలుపెట్టి మహా శివరాత్రికి కొన్ని రోజుల ముందు పూర్తి చేస్తారు. మూడు మూరలు వెడల్పు, 300 మూరలు పొడవుతో ఉన్న పాగ ఉండలను ఇప్పటికే శ్రీశైలానికి తీసుకువచ్చారు. పాగాలంకరణను వీక్షించి జన్మ ధన్యం చేసుకునేందుకు శివ భక్తులు ఎదురు చూస్తున్నారు.ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా చేసే పాగాలంకరణను చూసేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. రాత్రి 10 నుంచి 12 గంటల వరకు ఆలయానికి పాగాలంకరణ జరుగుతుంది. ఆ సమయంలో ఆచార సాంప్రదాయాలను అనుసరించి ఆలయం లోపల విద్యుత్ దీపాలను ఆర్పేస్తారు. పృథ్వీ సుబ్బారావు దిగంబరుడై, మల్లికార్జున స్వామి బంగారు విమాన గోపురం పై భాగాన ఉన్న త్రిశూలం వద్ద నుంచి కింద ఉన్న నందుల వరకు పాగాలంకరణ చేస్తారు.అదే సమయంలో ఆలయంలో లోపల శ్రీ మల్లికార్జున స్వామికి అర్చకులు లింగోద్భవకాల మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. పాగాలంకరణ పూర్తైన తర్వాత విద్యుత్ దీపాలను వెలిగిస్తారు. ఆ సమయంలో పాగాలంకరణతో దర్శనమిచ్చే మల్లన్న ఆలయానికి నమస్కరించుకొని భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వం చెందుతారు. ఆ తర్వాత శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారికి కల్యాణం జరగనుంది.

# స్పీడందుకున్న రాజధాని పనులు

**సీడ్ యాక్సెస్ రోడ్డు ఫేజ్-3 వర్క్స్ ప్రారంభం**

**వేగం పుంజుకున్న సీడ్‌యాక్సెస్ రోడ్డు పనులు**

**బకింగ్‌హాం కెనాల్‌పై శరవేగంగా స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం,**

**ఫేజ్-3లో భాగంగా 3 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్,**

**రూ.512 కోట్ల వ్యయంతో ఫేజ్-3 నిర్మాణం**



రాజధాని అమరావతి రహదారుల పనుల్లో మరో ముందడుగు పడింది. అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డులో అత్యంత కీలకమైనటువంటి ఫేజ్-3 పనులన్నీ మొదలయ్యాయి. ప్రధానంగా మూడో దశలో మొత్తం 3.51 కిలోమీటర్ల పొడవైన రహదారి నిర్మిస్తుండగా, ఇందులో దాదాపు 3 కిలోమీటర్ల వరకు ఎలివేటెడ్ కారిడార్ ఉండటం గమనార్హం.సీడ్ యాక్సెస్ రోడ్డు మూడో దశలో బ్యారేజీ దగ్గరున్న పంపింగ్ స్టేషన్ వెనుక భాగంలో మొదలై గుంటూరు ఛానల్, కొండవీటివాగు, కృష్ణా పశ్చిమ డెల్టా కాలువలను దాటి, పాత జీటీ రోడ్డుపైనున్న ఆర్చ్ బ్రిడ్జి మీదుగా, సీతానగరం కొండ పక్క నుంచి వెళ్లి ఆపై మణిపాల్ ఆసుపత్రి వద్ద చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిలో కలుస్తుంది. మణిపాల్ ఆసుపత్రి వద్ద ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్‌ను నిర్మిస్తారు. అంతేకాకుండా సీడ్‌యాక్సెస్ రోడ్డు ఫేజ్-1, 2 పనులు చేస్తున్న గుత్తేదారు సంస్థ ఎన్‌సీసీనే ఫేజ్-3 పనులను సైతం దక్కించుకుంది. దీనికితోడు కొండవీటివాగు, గుంటూరు ఛానళ్లపై బ్రిడ్జి నిర్మాణానికి పైల్స్ పనులు కూడా మొదలయ్యాయి.రూ.512 కోట్లతో ఫేజ్-3 పనులు: సీడ్‌యాక్సెస్ రోడ్డు ఫేజ్-3 రహదారి అంచనా వ్యయం మొత్తం రూ.512 కోట్లు. పన్నులు, ఇతర వ్యయాలు కలిపితే ఇంకా పెరిగే అవకాశాలు లేకపోలేదు. అదే విధంగా ఫేజ్-3 లో భాగంగానే కొండవీటివాగు, గుంటూరు ఛానల్‌పై 262 మీటర్ల పొడవైన బ్రిడ్జి నిర్మిస్తారు. దీని తర్వాత మళ్లీ సుమారు 100 మీటర్ల పొడవైన రోడ్డు ఉంటుంది. అక్కడ నుంచి నేరుగా ఎలివేటెడ్ కారిడార్ అనేది మొదలవుతుంది. ఎలివేటెడ్ కారిడార్ పాత జీటీ రోడ్డులో భాగంగా బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మించిన ఆర్చ్ బ్రిడ్జి మీదుగా వెళ్తుంది. మధ్యలో రైల్వే లైన్‌ను సైతం దాటవలసి ఉంటుంది. ఆర్చ్ బ్రిడ్జి నుంచి రైల్వే లైన్ అధిగమించే వరకు బ్రిడ్జి అది ఎంతో ఎత్తులో ఉంటుంది. ఆ భాగాన్ని ఎక్స్‌ట్రాడోస్ బ్రిడ్జి అని అంటారు.అదే రీతిలో సీడ్‌యాక్సెస్ రోడ్డును పాత జీటీ రోడ్డుతోనూ అనుసంధానిస్తున్నారు. ఇందుకు బకింగ్‌హాం కాలువపై స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులనేవి శరవేగంగా జరుగుతున్నాయి. ఇది ప్రీకాస్ట్ బ్రిడ్జి అని చెప్పవచ్చు. బ్రిడ్జి భాగాలను హైదరాబాద్‌లో రూపొందించి, ఇక్కడికి తెచ్చి అమరుస్తున్నారు. స్టీల్ గడ్డర్లు అమర్చే పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. నాలుగు వరుసలుగా నిర్మిస్తున్న దీని పొడవు దాదాపు 110 మీటర్లు. కొండవీటివాగు, గుంటూరు ఛానళ్లపై నిర్మిస్తున్న వంతెనలను దాటిన తర్వాత సీడ్‌యాక్సెస్ రోడ్డును స్టీల్‌బ్రిడ్జితో అనుసంధానిస్తూ ఒక రోడ్డును నిర్మిస్తారు.విజయవాడ నుంచి ప్రకాశం బ్యారేజీ మీదుగా అటు మంగళగిరి వైపు నుంచి రాజధానిలోకి వెళ్లేవారు ఈ స్టీల్‌బ్రిడ్జి మీదుగా సీడ్‌యాక్సెస్ రోడ్డులోకి నేరుగా ప్రవేశించవచ్చు. స్టీల్ బ్రిడ్జి, కొండవీటి వాగు, గుంటూరు ఛానళ్లపై బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే ముందుగా సీడ్‌యాక్సెస్ రోడ్డును పాత జీటీ రోడ్డుతో అనుసంధానిస్తారు. అంతేకాకుండా ఫేజ్-3 నిర్మాణం పూర్తయ్యేంత వరకు స్టీల్ బ్రిడ్జి మీదుగా రాజధాని అమరావతిలోకి రాకపోకలను సజావుగా సాగించేందుకు వెసులుబాటు అనేది లభిస్తుంది. ప్రస్తుతం కృష్ణా కరకట్టే ప్రధాన రహదారిగా ఉన్నది. స్టీల్‌బ్రిడ్జి నిర్మాణానికి మార్చి నెలాఖరు వరకు సమయం పడుతుంది. కొండవీటి వాగు, గుంటూరు ఛానళ్లపై బ్రిడ్జి నిర్మాణం మే నెలాఖరుకు పూర్తయ్యే అవకాశాలున్నాయి.

**వేగంగా ఫేజ్-2 నిర్మాణం:** అమరావతికి ప్రధాన అనుసంధాన రహదారి సీడ్‌యాక్సెస్ రోడ్డు. రాజధానిలోని బోరుపాలెం నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు నిర్మిస్తున్నారు. దీని మొత్తం పొడవు 21.78 కిలోమీటర్ల 2016వ సంవత్సరంలోనే దీని నిర్మాణం మొదలైంది. అయితే తొలి దశలో బోరుపాలెం నుంచి మంతెన సత్యనారాయణరాజు ప్రకృతి ఆశ్రమం వరకు సుమారు 14.35 కిలోమీటర్ల పొడవైన రహదారి నిర్మాణాన్ని పూర్తి చేశారు. అనంతరం మంతెన ఆశ్రమం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు దాదాపు 3.92 కిలోమీటర్ల రెండో దశ రహదారి నిర్మాణం భూసేకరణ సమస్యలతో నిలిచిపోయింది. ఇప్పుడు సీడ్‌యాక్సెస్ రోడ్డు పనుల్లో సైతం వేగం పుంచుకుంది.ఇక ఫేజ్-2 నిర్మాణానికి భూసమీకరణలో ఇంకా భూములు ఇవ్వని రైతులను ఒప్పించేందుకు సీఆర్‌డీఏ అన్ని ప్రయత్నాలను చేస్తోంది. ఇందుకు కొందరు రైతులు ముందుకొచ్చి భూములివ్వడంతో రెండోదశ నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ఇప్పటికీ ముందుకురాని రైతుల నుంచి భూములను తీసుకునేందుకు గాను భూసేకరణ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.అంతేకాకుండా సీడ్‌యాక్సెస్ రోడ్డు ఫేజ్-1 తొమ్మిది వరుసలుగా నిర్మించారు. అదే విధంగా ఫేజ్-2 సైతం తొమ్మిది వరుసలుగానే నిర్మిస్తారు. మొదట మధ్యలో మూడు వరుసల రహదారిని నిర్మిస్తున్నారు. భూగర్భడ్రైనేజీ, నీటిపారుదల వ్యవస్థ, విద్యుత్, ఐటీసీ కేబుళ్లు వంటివి వాటిని డక్ట్‌ల్లో ఏర్పాటు చేస్తారు. వీటి నిర్మాణం పూర్తయిన అనంతరం చెరొక వైపుగా 3 వరుసల చొప్పున మిగతా ఆరు వరుసలను పూర్తి చేసేస్తారు. ఇక ఫేజ్-2 రహదారిని మంతెన ఆశ్రమం నుంచి ప్రారంభించి భూసేకరణ సమస్య రానంత వరకు 1.6 కిలోమీటర్ల పొడవున మూడు వరుసలుగా నిర్మించి, ఆ తర్వాత కృష్ణా కరకట్ట రోడ్డుకు తాత్కాలికంగా కలిపారు. కరకట్ట రోడ్డుపై రద్దీని కొంత వరకు తగ్గించేందుకు ఈ ఏర్పాటును చేశారు.సీడ్ యాక్సెస్ పనుల్లో భాగంగా కొండవీటివాగు, గుంటూరు ఛానల్‌పై బ్రిడ్జి, బకింగ్‌హాం కెనాల్‌పై స్టీల్‌బ్రిడ్జిల నిర్మాణలను పూర్తి చేసి సీడ్‌యాక్సెస్ రోడ్డును పాత జీటీ రోడ్డుతో అనుసంధానిస్తే కరకట్ట రోడ్డుపై రద్దీ బాగా తగ్గే అవకాశం ఉంది. అయితే సీడ్‌యాక్సెస్ రోడ్డు ఫేజ్-3 నిర్మాణం సైతం పూర్తై జాతీయ రహదారితో అనుసంధానిస్తే మాత్రం రాజధానికి పూర్తి స్థాయిలో రాచబాట పడినట్లే అవుతుంది.

## రోజూ ఉదయాన్నే గిన్నెడు దానిమ్మ గింజలు తింటే మీ ఆయుష్షు రెట్టింపు



ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో దానిమ్మ ముఖ్యమైనది. ఇది రక్త ప్రసరణకు, గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. దానిమ్మలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దానిమ్మ ఆరోగ్యకరమైన పండు మాత్రమే కాదు సమతుల్య ఆహారం కూడా. రోగనిరోధక శక్తికి చాలా ముఖ్యమైన పండు. అందుకే దానిమ్మ అత్యంత.. దానిమ్మ ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది. ఇది రక్త ప్రసరణకు, గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. దానిమ్మలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దానిమ్మ ఆరోగ్యకరమైన పండు మాత్రమే కాదు సమతుల్య ఆహారం కూడా. రోగనిరోధక శక్తికి చాలా ముఖ్యమైన పండు. అందుకే దానిమ్మ అత్యంత ఆరోగ్యకరమైన, పోషకమైన పండ్లలో ఒకటిగా పరిగణిస్తారు. ప్రతిరోజూ గిన్నె దానిమ్మ విత్తనాలు తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మ కాంతిని మెరుగుపరుస్తుంది. పేగు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. దీనిలోని ఫైబర్, పోషకాలు గుండె ఆరోగ్యం, వాపు, జీర్ణక్రియపై సానుకూల ప్రభావాలను చూపుతాయి. దానిమ్మపండు పేగులకు మంచి ఆహారం. ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉండటం వల్ల ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లను దూరంగా ఉంచుతుంది. యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల ఇది చర్మంపై ప్రయోజనకరమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది పేగులకు ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. ముఖ్యంగా దానిమ్మపండ్లలో ప్యూనికాలాజిన్లు, ఆంథోసైనిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని ఫ్రీ రాడికల్ నష్టం, ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షిస్తాయి. దానిమ్మలోని పాలీఫెనాల్స్ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. వాపును తగ్గిస్తాయి.కణాలను దెబ్బతినకుండా కాపాడుతాయి. దానిమ్మ రసం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దాని శోథ నిరోధక లక్షణాల కారణంగా ధమనులలో కొలెస్ట్రాల్ పేరుకుపోకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. దానిమ్మపండు కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరచడం, రక్తపోటును తగ్గించడం, ధమనుల్లో ఫలకం ఏర్పడకుండా నిరోధించడం ద్వారా గుండె ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. అందుకే ఆహారంలో విటమిన్లు సి, కె, పొటాషియం, డైటరీ ఫైబర్ వంటి ముఖ్యమైన పోషకాలను తీసుకోవడం చాలా అవసరం. రోజూ ఉదయం పూట గిన్నె దానిమ్మ విత్తనాలు తింటే.. ఇందులో ఉండే ఫైబర్ కంటెంట్ మంచి జీర్ణక్రియకు దోహదం చేస్తుంది. ఇది మలబద్ధకానికి కూడా మంచి నివారణ.

## వేసవి నుంచి ఉపశమనం కోసం దక్షిణ భారత దేశంలోని ఈ హిల్స్ స్టేషన్స్ బెస్ట్ ఎంపిక



దక్షిణ భారతదేశంలో వేసవిలో ఉష్ణోగ్రత గణనీయంగా పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో ప్రజలు సెలవు దినాలలో ఎక్కడికైనా వెళ్ళాలనుకుంటారు. వేడి నుండి ఉపశమనం పొందడంతో పాటు మీ బడ్జెట్‌లోనే ప్రయాణించగల అనేక ప్రదేశాలు ఉన్నాయని మీకు తెలుసా. ఈ రోజు దక్షిణ భారతదేశంలోని 5 బడ్జెట్ ఫ్రెండ్లీ హిల్ స్టేషన్ల గురించి తెలుసుకుందాం వేసవి సెలవులు ప్రారంభం అయ్యాయి. దీంతో పిల్లలను విహారయాత్రకు తీసుకెళ్లడానికి ఇదే ఉత్తమ అవకాశమని తల్లిదండ్రులు భావిస్తారు. వేసవి కాలంలో ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించడానికి హిమాచల్, కాశ్మీర్ , ఉత్తరాఖండ్ వంటి ప్రదేశాలకు వెళతారు. ఈ ప్రదేశాలు పర్వతాలతో నిండి ప్రకృతికి దగ్గరగా ఉంటాయి. దీంతో ఇక్కడ వేడి, తేమ నుండి ఉపశమనం లభిస్తుంది, కొన్ని రోజులైనా ప్రశాంతంగా గడపవచ్చని అనుకుంటారు. అయితే దక్షిణ భారతదేశం లో కూడా వేసవి నుంచి ఉపశమనం అందించే అనేక ప్రదేశాలున్నాయి. వేసవిలో పర్యటించడానికి అనుకూలమైన 5 ఉత్తమ ప్రదేశాల గురించి తెలుసుకుందాం.. వేసవి సెలవులు ప్రారంభం అయ్యాయి. దీంతో పిల్లలను విహారయాత్రకు తీసుకెళ్లడానికి ఇదే ఉత్తమ అవకాశమని తల్లిదండ్రులు భావిస్తారు. వేసవి కాలంలో ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించడానికి హిమాచల్, కాశ్మీర్ , ఉత్తరాఖండ్ వంటి ప్రదేశాలకు వెళతారు. ఈ ప్రదేశాలు పర్వతాలతో నిండి ప్రకృతికి దగ్గరగా ఉంటాయి. దీంతో ఇక్కడ వేడి, తేమ నుండి ఉపశమనం లభిస్తుంది, కొన్ని రోజులైనా ప్రశాంతంగా గడపవచ్చని అనుకుంటారు. అయితే దక్షిణ భారతదేశం లో కూడా వేసవి నుంచి ఉపశమనం అందించే అనేక ప్రదేశాలున్నాయి. వేసవిలో పర్యటించడానికి అనుకూలమైన 5 ఉత్తమ ప్రదేశాల గురించి తెలుసుకుందాం..

1 / 6

మున్నార్: దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన హిల్ స్టేషన్. ఇది పచ్చదనంతో నిండి ఉంటుంది. అందంలో కాశ్మీర్‌ను కూడా మించిపోతుంది. ఇక్కడి తేయాకు తోటలే దీనికి నిజమైన గుర్తింపు. వేసవిలో ఇక్కడి వాతావరణం చల్లగా.. తాజాగా ఉంటుంది. మీరు వెళ్తే తేయాకు తోటలను సందర్శించడంతో పాటు, ఎరవికులం నేషనల్ పార్క్, మట్టుపెట్టి ఆనకట్ట, అట్టుకల్ జలపాతాలను కూడా అన్వేషించవచ్చు.

మున్నార్: దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన హిల్ స్టేషన్. ఇది పచ్చదనంతో నిండి ఉంటుంది. అందంలో కాశ్మీర్‌ను కూడా మించిపోతుంది. ఇక్కడి తేయాకు తోటలే దీనికి నిజమైన గుర్తింపు. వేసవిలో ఇక్కడి వాతావరణం చల్లగా.. తాజాగా ఉంటుంది. మీరు వెళ్తే తేయాకు తోటలను సందర్శించడంతో పాటు, ఎరవికులం నేషనల్ పార్క్, మట్టుపెట్టి ఆనకట్ట, అట్టుకల్ జలపాతాలను కూడా అన్వేషించవచ్చు.

2 / 6

ఊటీ : ఉదకమండలం అని హిల్ స్టేషన్ల రాణి అని కూడా పిలుస్తారు. ఈ హిల్ స్టేషన్ కూడా చాలా అందంగా.. ప్రశాంతంగా ఉంటుంది. ఇక్కడ వాతావరణం పచ్చదనం, ప్రశాంతతతో మనసుకు ఆహ్లాదాన్ని ఇస్తుంది. చాలా చక్కటి కలపతో చేసిన నివాసాలు డిఫరెంట్ అనుభవాన్ని ఇస్తాయి. వేసవిలో కూడా ఇక్కడ ఉష్ణోగ్రత చల్లగా ఉంటుంది. ఇక్కడ సందర్శించాల్సిన ప్రదేశాలు బొటానికల్ గార్డెన్, %ూ% సరస్సు, దొడ్డబెట్ట శిఖరం.

ఊటీ : ఉదకమండలం అని హిల్ స్టేషన్ల రాణి అని కూడా పిలుస్తారు. ఈ హిల్ స్టేషన్ కూడా చాలా అందంగా.. ప్రశాంతంగా ఉంటుంది. ఇక్కడ వాతావరణం పచ్చదనం, ప్రశాంతతతో మనసుకు ఆహ్లాదాన్ని ఇస్తుంది. చాలా చక్కటి కలపతో చేసిన నివాసాలు డిఫరెంట్ అనుభవాన్ని ఇస్తాయి. వేసవిలో కూడా ఇక్కడ ఉష్ణోగ్రత చల్లగా ఉంటుంది. ఇక్కడ సందర్శించాల్సిన ప్రదేశాలు బొటానికల్ గార్డెన్, %ూ% సరస్సు, దొడ్డబెట్ట శిఖరం.

3 / 6

కూర్గ్: ఇక్కడి పచ్చదనం, పర్వతాలు దీనిని స్వర్గంలా అందంగా కనిపించేలా చేస్తాయి. కూర్గ్‌ను స్కాట్లాండ్ ఆఫ్ ఇండియా అని కూడా పిలుస్తారు. ఇక్కడ కాఫీ తోటలను అన్వేషించవచ్చు. జలపాతాలను కూడా ఆస్వాదించవచ్చు. వేసవిలో సందర్శించడానికి , విశ్రాంతి తీసుకోవడానికి ఇది సరైన ప్రదేశం. ఇక్కడికి వెళ్తే ఖచ్చితంగా అబ్బి జలపాతం, దుబారే ఎలిఫెంట్ క్యాంప్, రాజా సీటు సందర్శించండి.

కూర్గ్: ఇక్కడి పచ్చదనం, పర్వతాలు దీనిని స్వర్గంలా అందంగా కనిపించేలా చేస్తాయి. కూర్గ్‌ను స్కాట్లాండ్ ఆఫ్ ఇండియా అని కూడా పిలుస్తారు. ఇక్కడ కాఫీ తోటలను అన్వేషించవచ్చు. జలపాతాలను కూడా ఆస్వాదించవచ్చు. వేసవిలో సందర్శించడానికి , విశ్రాంతి తీసుకోవడానికి ఇది సరైన ప్రదేశం. ఇక్కడికి వెళ్తే ఖచ్చితంగా అబ్బి జలపాతం, దుబారే ఎలిఫెంట్ క్యాంప్, రాజా సీటు సందర్శించండి.

4 / 6

పొన్ముడి: పొన్ముడి సౌత్‌లోని తక్కువ రద్దీ ఉండే హిల్ స్టేషన్. స్వచ్ఛమైన గాలిని , పచ్చదనాన్ని ఆస్వాదించగల ప్రదేశం. ఈ ప్రదేశం ట్రెక్కింగ్, వన్యప్రాణులు, ప్రశాంతమైన లోయలకు అనువైనది. ఇక్కడ గోల్డెన్ వ్యాలీ, మినీ జలపాతాలు చూడదగ్గవి.

పొన్ముడి: పొన్ముడి సౌత్‌లోని తక్కువ రద్దీ ఉండే హిల్ స్టేషన్. స్వచ్ఛమైన గాలిని , పచ్చదనాన్ని ఆస్వాదించగల ప్రదేశం. ఈ ప్రదేశం ట్రెక్కింగ్, వన్యప్రాణులు, ప్రశాంతమైన లోయలకు అనువైనది. ఇక్కడ గోల్డెన్ వ్యాలీ, మినీ జలపాతాలు చూడదగ్గవి.

5 / 6

కున్నూర్: ఇది చాలా ప్రశాంతంగా, తక్కువ రద్దీగా ఉండే హిల్ స్టేషన్. ప్రశాంతమైన క్షణాలు గడపాలనుకుంటే కున్నూర్ ఉత్తమమైనది. ఇక్కడ టీ తోటలు, లాంగ్ డ్రైవ్‌లు, సహజ సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. ఇక్కడ కేసిమ్స్ పార్క్, డాల్ఫిన్స్ నోస్, లాంబ్స్ రాక్ సందర్శించదగినవి.

కున్నూర్: ఇది చాలా ప్రశాంతంగా, తక్కువ రద్దీగా ఉండే హిల్ స్టేషన్. ప్రశాంతమైన క్షణాలు గడపాలనుకుంటే కున్నూర్ ఉత్తమమైనది. ఇక్కడ టీ తోటలు, లాంగ్ డ్రైవ్‌లు, సహజ సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. ఇక్కడ కేసిమ్స్ పార్క్, డాల్ఫిన్స్ నోస్, లాంబ్స్ రాక్ సందర్శించదగినవి.

## బాత్‌రూమ్‌లో కూర్చొని రీల్స్ స్క్రోల్ చేస్తున్నారా?.. వెంటనే ఆపలేదో.. మీ బాడీ షెడ్డుకే!



సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ఫోన్‌లకే అతుక్కుపోతున్నారు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునేదాకా.. సోషల్ మీడియా ప్రపంచంలోనే బ్రతికేస్తున్నారు. కొంతమందైతే బాత్‌రూమ్‌లోనూ ఫోన్ చూస్తూ గంటల తరబడి కూర్చుంటున్నారు. కానీ ఇలా ఎక్కువ సమయం బాత్రూమ్‌లో రీల్స్ చూస్తూ ఉడడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం. టెక్నాలజీ రోజురోజుకూ పెరుగుతోంది. మన జీవనశైలి కూడా అంతే. స్మార్ట్‌ఫోన్‌లు జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారాయి. కొంతమందైతే బాత్‌రూమ్‌లోనూ ఫోన్ చూస్తూ గంటల తరబడి కూర్చుంటున్నారు. ఈ అలవాటు చాలా మందికి రోజువారీ దినచర్యగా మారింది. ఇప్పుడు ఈ అలవాటు పెద్ద ప్రభావం చూపకపోయినా.. కాలక్రమేణా, తీవ్రమైన ఆరోగ్య పరిణామాలను కలిగిస్తుంది. ఇది మీ ప్రేగుల ఆరోగ్యాన్ని నాశనం చేయడమే కాకుండా హేమోరాయిడ్ల ప్రమాదాన్ని పెంచుతుంది. టాయిలెట్‌లో మీరు ఫోన్‌ను ఉపయోగించడం వల్ల ఇంకా ఎలాంటి సమస్యలు వస్తాయో చూద్దాం. ఎయిమ్స్, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్‌లలో శిక్షణ పొందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి ప్రకారం.. టాయిలెట్‌లో కూర్చుని స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించే వారికి హెమోరాయిడ్స్ వచ్చే అవకాశం 46% ఎక్కువగా ఉన్నట్టు ఆయన తెలిపారు. ఇందుకు ప్రదాన కారణం ఎక్కువసేపు ఒకే స్థితిలో కూర్చోవడమే అంటున్నారు నిపుణులు. అధిక పీడనం వల్ల మలద్వారం, పురీషనాళంలోని సిరల్లో వాపు వస్తుందని.. ఇది మూలవ్యాధికి వచ్చే అవకాశాన్ని పెంచుతుందని ఆయన తెలిపారు. ఆహారం, వయస్సు, బరువు, శారీరక శ్రమ వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా, టాయిలెట్‌లో కూర్చుని ఫోన్ ఉపయోగించడం వల్ల మూలవ్యాధి ప్రమాదంపై బలమైన ప్రభావం చూపుతుందని పరిశోధకులు చెబుతున్నారు స్మార్ట్‌ఫోన్ వినియోగదారులలో దాదాపు 37 శాతం మంది ఐదు నిమిషాల కంటే ఎక్కువ సమయం టాయిలెట్‌లో గడుపుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఐదు నిమిషాలు అంతగా అనిపించకపోవచ్చు, కానీ ఎక్కువసేపు కూర్చోవడం వల్ల అనేక మన శరీరంలోని అనే భాగాలపై నిరంతరం ఒత్తిడి పడుతుంది. ఇది కాలక్రమేనా అలవాటుగా మారినప్పుడు, అది క్రమంగా పురీషనాళంలోని సిరలను బలహీనపరుస్తుంది. మలవిసర్జన సమయంలో ఒత్తిడికి గురికావడం అనేది మూలవ్యాధికి ఒక సాధారణ కారణమని మనని ఆయన చెబుతున్నారు. అలాగే, ఎక్కువసేపు టాయిలెట్‌లో కూర్చోవడం వల్ల రక్త ప్రసరణ దెబ్బతింటుంది, ముఖ్యంగా కాళ్లలో. డీప్ వెయిన్ థ్రాంబోసిస్ లేదా ఇప్పటికే ఉన్న ప్రసరణ సమస్యలు మరింత తీవ్రమవడానికి ఇది ఒక ప్రధాన అంశం. కాబట్టి మీరు బాత్రూంలో ఎక్కువ సమయం గడుపుతున్నట్టు అయితే వెంటనే ఈ అలావాటును మానుకోండి.

## వాషింగ్ మెషిన్ నుంచి దుర్వాసన వస్తుందా? ఖర్చు లేని చిట్కా..



వాషింగ్ మెషిన్ అనేది ఇప్పుడు మన దైనందిన జీవితంలో ఒక భాగం. అయితే, కొన్నిసార్లు అందులో నుంచి వచ్చే దుర్వాసన మన దుస్తులకూ అంటుకుని ఇబ్బంది పెడుతుంది. దీనిని వదిలించుకోవడానికి చాలామంది రసాయన ఆధారిత క్లీనర్లను ఉపయోగిస్తారు. కానీ, మన ఇంట్లో దొరికే కేవలం రెండు సాధారణ వస్తువులతో ఈ సమస్యను సులభంగా పరిష్కరించుకోవచ్చు. అవేంటో చూద్దాం.. నేడు చాలా ఇళ్లలో వాషింగ్ మెషిన్ ఒక ముఖ్యమైన వస్తువుగా మారిపోయింది. ప్రతి వారం 3-4 సార్లు దీనిని ఉపయోగిస్తాం. తరచుగా శుభ్రం చేయకపోతే లేదా వాడే నీరు శుభ్రంగా లేకపోతే దీనిలో దుర్వాసన వస్తుంది. ఆ వాసన దుస్తులకు కూడా అంటుకుంటుంది. ఈ పరిస్థితిని నివారించడానికి వాషింగ్ మెషిన్‌ను శుభ్రం చేయడం అవసరం. దీనికి ఎక్కువ ఖర్చు పెట్టాల్సిన పని లేదు. కొన్ని సులభమైన చిట్కాలతో ఈ సమస్యను పరిష్కరించవచ్చు.

**కావాల్సిన వస్తువులు:** పటిక 1 ముక్క, నిమ్మకాయ తొక్కలు 4, నీరు 2 లీటర్లు.

**తయారీ విధానం:**

ముందుగా, 2 లీటర్ల నీటిని బాగా మరిగించాలి. నీరు మరిగిన తర్వాత, పటికను పొడి చేసి అందులో కలపాలి. నిమ్మకాయ తొక్కలు కూడా అందులో వేయాలి. ఈ మిశ్రమాన్ని 15 నిమిషాల పాటు మరిగించాలి. నీరు సువాసన వస్తున్నప్పుడు స్టవ్ ఆపివేసి, 15 నిమిషాలు మూతపెట్టి అలాగే ఉంచాలి. ఆ తర్వాత, ఆ ద్రావణాన్ని డిటర్జెంట్ పోసే చోట, మిగిలిన దానిని వాషింగ్ మెషిన్ డ్రమ్ లోపల పోయాలి. డ్రమ్‌లో ఎలాంటి దుస్తులు ఉండకూడదు. మెషిన్‌ను 15-20 నిమిషాల పాటు నడిపించాలి. ఆ నీరు డ్రమ్‌లో ఉన్న మురికిని శుభ్రం చేస్తుంది. ఆ నీరు పూర్తిగా బయటకు వెళ్ళిన తర్వాత, మళ్ళీ 15 నిమిషాలు మంచి నీటితో మెషిన్‌ను నడిపించాలి. పూర్తయిన తర్వాత, మెషిన్‌ను ఆపివేసి, డోర్ తెరిచి గాలి తగిలేలా ఉంచాలి. డ్రమ్ ఆరిపోయిన తర్వాత, దుర్వాసన పూర్తిగా పోతుంది.

**ఈ టిప్స్ పాటించండి..**

వాషింగ్ మెషిన్ ఎక్కువ కాలం తాజాగా, శుభ్రంగా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. ప్రతి వాష్ తర్వాత మెషిన్ డోర్‌ను కాసేపు తెరిచి ఉంచాలి. దీనివల్ల లోపల తేమ ఆరిపోయి, దుర్వాసన రాకుండా ఉంటుంది.

## ఎంతసేపు ఉడికించాలి..?



గుడ్డు సంపూర్ణ పోషకాహారంగా వైద్యులు చెబుతారు. గుడ్డులో ప్రొటీన్, అత్యవసరమైన 9 అమైనో ఆమ్లాలు, బి కాంప్లెక్స్ విటమిన్లు, డి విటమిన్ తో పాటుగా ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్లనే వైద్యులు కూడా రోజుకో గుడ్డు తినడం ఆరోగ్యానికి మంచిదని చెబుతుంటారు. ఈ కారణంతోనే చాలా మంది బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ లో ఉడికించిన గుడ్డును మరికొందరు ఆమ్లెట్ రూపంలో తీసుకోవడానికి ఇష్టపడుతుంటారు. మరి గుడ్లను ఎంతసేపు ఉడికించాలి..? మీకు తెలుసా..? శరీరానికి అవసరమయ్యే ప్రొటీన్లు గుడ్డులో చాలా ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే గుడ్డును సంపూర్ణ పోషకాహారమని నిపుణులు అంటారు. కనీసం రోజుకు ఒక్క కోడి గుడ్డు అయినా తినాలని సూచిస్తుంటారు. డైలీ ఉడకబెట్టిన గుడ్డును తినడం వల్ల ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే గుడ్లను ఎంతసేపు ఉడికించాలని చాలామందికి సందేహం ఉంటుంది. అయితే గుడ్డును 4 నుంచి 6 నిమిషాలు ఉడికిస్తే పై పొర లైట్ గా గట్టిపడుతుంది. లోపలి పచ్చసొన మాత్రం జిగురులా ఉంటుంది. జపాన్ లో ఇలా తింటారు. %వాశ్రీంశీ =ఘుఐ% "భుజం నొప్పి.. ఫ్రోజెన్ షోల్డర్ కు ఉపశమనం కోసం ఇలా చెయ్యండి! " ఇక గుడ్డును 7 నుంచి 9 నిమిషాల పాటు ఉడికిస్తే మీడియమ్ బాయిలింగ్ అంటారు. తెల్లసొన ఉడుకుతుంది. పచ్చసొన కొద్దిగా ఉడికి క్రీమీగా మారుతుంది. దీంట్లో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. సలాడ్స్ లో అధికంగా వాడతారు. ఇక గుడ్డును 10-12 నిమిషాలు ఉడికిస్తే దాన్ని హార్డ్ బాయిలింగ్ అంటారు. దీంట్లో తెల్లసొన, పచ్చసొన పూర్తిగా ఉడుకుతాయి. అలాగే 12 నిమిషాల కంటే అధికంగా ఉడికిస్తే ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. పచ్చ సొనలో ఐరన్, సల్ఫర్ రియాక్షన్ మొదలై.. కడుపుబ్బరం, అజీర్తి సమస్యలు వస్తాయని చెబుతున్నారు

## చికెన్ లేదా మటన్ త్వరగా ఉడికి, మెత్తగా టేస్టీగా ఉండాలంటే.. ఈ చిట్కాలను పాటించండి..!



నాన్ వెజ్ ప్రియులు చికెన్, మటన్ లకు చెందిన అనేక వంటకాలను ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఇంట్లో లేదా బయట ఎక్కడైనా సరే నాన్ వెజ్ వంటకాలు కనిపిస్తే నోట్లో నీళ్లూరుతుంటాయి. వీటితోపాటు చేపలు, రొయ్యల వంటి ఆహారాలను ఇష్టంగా తినే వారు కూడా ఉంటారు. అయితే బయట రెస్టారెంట్లలో తిన్నప్పుడు చికెన్, మటన్ వంటివి ఎంతో మెత్తగా ఉంటాయి. కానీ ఇంట్లో మాత్రం వీటిని వండితే అంత మెత్తగా ఉండవు. నాన్ వెజ్‌కు చెందిన ముక్కలు ఎంత మెత్తగా ఉంటే అంత టేస్టీగా ఉంటాయి. చేపలు, రొయ్యలు వంటి వాటిని ఎక్కువగా ఉడికించాల్సిన పనిలేదు. కానీ చికెన్, మటన్‌లను మాత్రం ఎక్కువ సేపు ఉడికించాల్సి ఉంటుంది. అయినప్పటికీ అవి కొన్ని సందర్భాల్లో త్వరగా ఉడకవు. అయితే ఇలాంటి సమయంలో ఏం చేయాలి.. నాన్ వెజ్ వంటకాలు త్వరగా ఉడికేందుకు పాటించాల్సిన చిట్కాలు ఏమిటి.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**మారినేషన్..**

చాలా మంది చికెన్ లేదా మటన్‌ను తమకు నచ్చిన స్టైల్‌లో వండుతారు. ఎలా వండినా, ఎంత రుచిగా ఉన్నా ముక్కలు మెత్తగా ఉంటేనే తినాలనిపిస్తుంది. ఇందుకు గాను కొన్ని చిట్కాలను పాటించాల్సి ఉంటుంది. చికెన్, మటన్ త్వరగా ఉడకాలంటే వాటిని కట్ చేసిన విధానంపై కూడా ఆధారపడి ఉంటుంది. కొందరు దుకాణదారులు కట్ చేసిన చికెన్ లేదా మటన్‌ను వండితే సుతిమెత్తగా ఉడుకుతాయి. కానీ కొన్ని అలా ఉండవు. కనుక చికెన్ లేదా మటన్‌ను కట్ చేసే విధానంపై కూడా వాటి మెత్తదనం, టేస్ట్ ఆధార పడి ఉంటాయి. మీకు చికెన్ లేదా మటన్‌ను ఇచ్చే దుకాణదారులు ఎలా కట్ చేస్తున్నారో చూడండి. దీంతో మీకు ఆ ముక్కలు ఎలా ఉడుకుతాయి అన్న అంశంపై అవగాహన వస్తుంది. అలాగే నాన్ వెజ్ వంటకాలను మారినేట్ చేయడం వల్ల వాటి మాంసం చాలా మృదువుగా మారుతుంది. అలాంటి మాంసం చాలా సులభంగా, త్వరగా ఉడుకుతుంది. పైగా టేస్టీగా కూడా ఉంటుంది. మారినేషన్‌కు వాడే పదార్థాల వల్ల మాంసం మెత్తగా మారి త్వరగా ఉడుకుతుంది. చికెన్ ను కనీసం 1 గంట పాటు, మటన్‌ను కనీసం 2 గంటల పాటు మారినేట్ చేసేలా చూడండి. దీంతో మెత్తని మాంసాన్ని ఆస్వాదించవచ్చు.

**సిట్రస్ ఆహారాలు..**

నాన్ వెజ్‌ను మారినేట్ చేసేందుకు గాను పెరుగు, మజ్జిగ, వెనిగర్, నిమ్మరసం వంటివి వాడవచ్చు. వీటిల్లో ఉండే యాసిడ్లు మాంసాన్ని మెత్తగా మారుస్తాయి. దీంతో మాంసం మెత్తగా ఉడుకుతుంది. మాంసం ఉడికేటప్పుడు అందులో పచ్చి బొప్పాయి, కివి, పైనాపిల్ వంటి వాటిని ముక్కలుగా కట్ చేసి వేయాలి. దీని వల్ల మాంసంలో ఉండే ప్రోటీన్లు సులభంగా విచ్ఛిన్నం అవుతాయి. అప్పుడు మాంసం త్వరగా ఉడుకుతుంది. అయితే వీటిని వేసిన తరువాత మాంసం ఉడకగానే వెంటనే ఆ ముక్కలను తీసేయాలి. లేదంటే మాంసం రుచి మారిపోతుంది. ఇక కొందరు వేపుడు వంటివి చేసేటప్పుడు మూతపెట్టకుండా నేరుగా వంట చేస్తారు. అలా చేయకూడదు. ముందుగా ముక్కలు బాగా ఉడికిన తరువాత వాటిని వేయించాల్సి ఉంటుంది. దీంతో ముక్కలు మెత్తగా ఉంటాయి. టేస్టీగా మారుతాయి.

**ఓవెన్ ఉంటే..**

సన్నని మంటపై పాత్రను ఉంచి దానిపై మూత పెట్టి మాంసాన్ని ఉడికించడం వల్ల కూడా మాంసం సుతిమెత్తగా మారుతుంది. మూత పెట్టి ఉడికించడం వల్ల ఆవిరి బయటకు పోదు. దీని వల్ల మాంసం త్వరగా ఉడుకుతుంది. టేస్టీగా కూడా ఉంటుంది. మీకు ఓవెన్ ఉంటే మాంసం చిదురు కాకుండా తగినంత ఉష్ణోగ్రతకు ఓవెన్ ను సెట్ చేసి మాంసాన్ని ఉడికించవచ్చు. దీని వల్ల కూడా మాంసం మెత్తగా మారుతుంది. అయితే సాధారణంగా చికెన్ త్వరగానే ఉడుకుతుంది. కానీ మటన్‌ను ఉడికించాలంటే చాలా బాగా కష్టపడాల్సి ఉంటుంది. అందువల్ల మటన్‌ను కొనేటప్పుడే లేత మటన్ ను ఎంచుకుంటే మంచిది. దీని వల్ల మటన్ త్వరగా ఉడకడమే కాకుండా రుచిగా కూడా ఉంటుంది. సులభంగా మారినేట్ అవుతుంది. హొటల్స్‌లో భారీ ఎత్తున పాత్రలను పెట్టి పెద్ద మంటతో ఉడికిస్తారు కనుక సహజంగానే మాంసం త్వరగా ఉడుకుతుంది. కానీ ఇళ్లలో వండితే మాత్రం మాంసం త్వరగా ఉడకాలన్నా, మెత్తగా మారాలన్నా ఆయా చిట్కాలను పాటించాల్సి ఉంటుంది.

## జీవితానికి వన్నెలద్దుదాం







జీవితం రంగురంగుల హరివిల్లులా ఉండాలని అందరూ కోరుకుంటారు. అయితే ఆ రంగులు మన మనసుపైనే కాదు జీవితం మీద కూడా ప్రభావం చూపిస్తాయంటే నమ్ముతారా? అవును, వివిధ వర్ణాలు మన వ్యక్తిత్వం, ఆలోచనా విధానం, ఆనందాన్ని మారుస్తాయి. దీనికి సంబంధించి ఎన్నో శాస్త్రీయ పరిశోధనలు, అధ్యయనాలు జరిగాయి. అవన్నీ కూడా రంగులు మన జీవితాన్ని ప్రభావితం చేస్తాయని తేల్చాయి. క్రోమో థెరపీ (కలర్ థెరపీ)తో మనిషిలో మార్పులు వస్తాయని నిపుణులు చెప్తున్నారు.

**కలర్ ఎఫెక్ట్..**

లివింగ్ స్పేస్: ఇల్లు, ఆఫీసు, పబ్లిక్ ప్రదేశాల్లో ఎక్కడైనా మనం ప్రశాంతతనే కోరుకుంటాం. అందువల్ల ఆయా ప్రదేశాల్లో నీలి రంగు, ఆకుపచ్చ రంగులు ఉంటే మనసుకు హాయిగా, ఉత్సాహంగా ఉంటుందట. భోజనం చేసే చోట మాత్రం ముచ్చట్లు పెడుతుంటాం! అక్కడ ఎరుపు, నారింజ రంగులు ఉండాలని నిపుణుల మాట. వెల్ బియింగ్: కొన్నిరకాల రంగులు మనలోని సృజనాత్మకతను వెలికితీస్తాయి. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది పసుపు రంగు. అలాగే సోషలైజేషన్‌ను ప్రోత్సహించే క్రమంలో నారింజ రంగు ఉపయోగపడుతుందట. చదువుకునే చోట, వ్యాపార లావాదేవీలు నిర్వహించే గదిలో నీలి, ఆకుపచ్చ రంగులు పాజిటివ్ వైబ్రేషన్స్‌ను కలిగిస్తాయని పరిశోధనల్లో తేలింది. దుస్తుల్లోనూ దోస్తీ: మనసుకు నచ్చిన రంగు దుస్తులనే చాలావరకు ఎంపిక చేసుకుంటాం. అలాకాకుండా రంగుల ప్రాముఖ్యాన్ని తెలుసుకుని వేసుకుంటే, కచ్చితంగా వ్యక్తిత్వంలో మార్పు వస్తుందని నిపుణులు చెప్తున్నారు. అంతేకాదు ముదురు రంగులు కాకుండా.. కూల్ కలర్స్ ఎంపిక చేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

**వ్యక్తిత్వంపై ప్రభావం**

ఎరుపు, నారింజ, పసుపు: ఈ కలర్స్ ఉత్సాహాన్ని కలిగిస్తాయి. మనలో ప్రేరణశక్తిని పెంచుతాయి. కానీ కొన్ని సందర్భాల్లో ఒత్తిడి, ఆకస్మిక ఆందోళనకు కూడా దారి తీస్తాయట. నీలి, ఆకుపచ్చ: ఈ రంగులు భావోద్వేగాలను స్థిరీకరిస్తాయి. ఏకాగ్ర చిత్తాన్ని కలిగిస్తాయి. మనసును ప్రశాంతపరుస్తాయి. చాలాసార్లు ఈ రంగులు అంగీకారాన్ని తెలియజేస్తాయట. నలుపు, బూడిద, గోధుమ: ఈ వన్నెలను గంభీరతకు చిహ్నంగా చెబుతారు. ఈ తరహా రంగు దుస్తులు ఎక్కువగా ధరించేవాళ్లు అంతర్ముఖంగా ఉంటారని నిపుణుల మాట. అయితే, బూడిద, గోధుమ రంగులు వేసుకున్నప్పుడు ఎదుటివ్యక్తుల నుంచి అనుకూల ప్రతిస్పందనలు వస్తాయట. ఊదా: ఈ వర్ణం ఊహ, ఆధ్యాత్మికతకు సంబంధించినదిగా చెప్తారు. కానీ ఈ రంగును ఎక్కువగా ఉపయోగించే ఆ వ్యక్తులు మానసికంగా అసౌకర్యంగా ఉన్నట్లుగా కొన్ని అధ్యయనాలు తేల్చాయి.

**క్రోమోథెరపీ..**

ఈ కలర్ థెరపీలో కొన్నిరకాల రంగులు ఉపయోగించి మానసిక ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమిని తగ్గిస్తారు. దానికోసం లైట్, డెకర్, క్లాథింగ్‌లో నీలిరంగు, ఆకుపచ్చ రంగులను ఉపయోగిస్తారు. నీలిరంగు వేరేచోట్ల ప్రయోజనాలు అందించినా, స్మార్ట్ ఫోన్ల విషయంలో కీడు చేస్తుంది. స్క్రీన్ నుంచి వచ్చే బ్లూ లైట్‌ను తగ్గించుకుంటే నిద్రలేమి సమస్య తగ్గుతుంది. దీన్ని అధిగమించడానికి స్క్రీన్ టైమ్ తగ్గించడంతోపాటు బ్లూలైట్ ఫిల్టర్లు వాడటం మంచిది. ఆకుపచ్చ, నీలిరంగులు ఆందోళనను తగ్గిస్తాయి. వాకింగ్, ఫారెస్ట్ ట్రెక్కింగ్, నేచర్ బాత్ థెరపీలోనూ ఈ రంగులను ఉపయోగిస్తుంటారు.

## ఆంధ్రలో నీరాజనాలు.. తెలంగాణలో నిందలు!

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి దాదాపు 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిత్తూరు జిల్లా కుప్పంలోని పరమసముద్రం చెరువును కృష్ణా జలాలతో నింపుతున్న వీడియోలను ఇటీవల చూసినప్పుడు మనసుకు ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది. ఏ రైతుకైనా లేదా వ్యవసాయంతో అనుబంధమున్న ఎవరికైనా సరే ఈ దృశ్యాలు అమితానందాన్నిస్తాయి. అంతేకాదు, రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదనే భరోసా కలిగిస్తాయి. ప్రాంతంతో సంబంధం లేకుండా తెలంగాణ సరిహద్దుల నుంచి తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో బీడువారిన గ్రామాల్లోని చెరువులను నింపుతూ నీళ్లు ఇంత దూరం ప్రయాణించడం ఒక మధుర ఘట్టమనే చెప్పాలి. ఈ ప్రయాణంలో కృష్ణా జలాలు మార్గమధ్యంలో అనేక జలాశయాలను నింపుతూ, కరువు ప్రభావిత రాయలసీమకు జీవం పోస్తాయి. భారతదేశ సైన్స్, టెక్నాలజీ రంగాలు, ప్రపంచ దౌత్యపరంగా గణనీయమైన పురోగతి సాధిస్తున్న ప్రస్తుత రోజుల్లోనూ వ్యవసాయానికి నీళ్లను అందించడం సాధ్యంకాని కలగానే మిగిలిపోయింది. అంతేకాదు, రైతులను పాలకులు ప్రకృతి అస్థిరతలకు వదిలేశారు. అయితే గత రెండు మూడు దశాబ్దాలను పరిశీలిస్తే, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి నీటిని ఉపయోగించడం లేదా మళ్లించడంలో గణనీయమైన పురోగతి కనిపిస్తున్నది. తెలంగాణలో నీటిపారుదల రంగాభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ చర్యలు ఆలస్యంగా రాష్ట్ర విభజన తర్వాత ప్రారంభమయ్యాయి. అయినప్పటికీ, 2014-2023 మధ్యకాలంలో వేగం పుంజుకోవడమే కాదుబీ గోదావరి, కృష్ణా నీటిని గొప్పగా ఉపయోగించడంలో అత్యద్భుతమైన ఫలితాలను సాధించారు.

నీటిపారుదలరంగంలో ప్రభుత్వం చేపట్టిన చర్యలకు సంబంధించిన లెక్కల గురించి కాదు ఈ వ్యాసం. సోషల్ మీడియా, ప్రధాన తెలుగు మీడియా (ప్రింట్, ఎలక్ట్రానిక్) సహాయంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని నీటిపారుదల పథకాలపై వ్యాప్తి చేసిన, చేస్తున్న విరుద్ధమైన కథనాల గురించి వివరించి చెప్పడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం. తెలంగాణలోని రైతులు, పరిశీలకుల మెదళ్లలో శాశ్వతంగా నిలిచిపోయేవి ఈ విరుద్ధ కథనాలే. ఉదాహరణకు కృష్ణా నీళ్లతో కుప్పం ప్రాంతంలోని చెరువులను నింపడం పట్ల ఏపీలో



విజయోత్సవాలు చేసుకున్నారు. దీనిపై విస్తృత ప్రచారం జరిగింది. రైతుల్లో ఉత్సాహం, అక్కడి అధికార పార్టీ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని కలిగించింది ఈ ఘటన. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ వార్త ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికే పరిమితమైంది. తెలంగాణ రైతులు, ముఖ్యంగా ప్రజలకు ఈ విషయం గురించి కనీస అవగాహన కూడా లేదు. తెలంగాణ వార్తాపత్రికల్లో ఈ వార్తను ప్రచురించకపోవడం, ఎలక్ట్రానిక్ మీడియాలో ఈ దృశ్యాలను చూపించకపోవడమే అందుకు కారణం. దీని వెనుక తెలంగాణ ప్రజలకు తెలియని పలు కారణాలున్నాయి. ఇందుకు విరుద్ధంగా 2023కు ముందు తెలంగాణలో ఇలాంటి అద్భుతమైన మైలురాళ్ల గురించిన వార్తలు ఈర్ష్యతోనూ, సాధ్యాసాధ్యాలపై అనుమానాలతోనూ, అసలు ఇలాంటివి అవసరమా? అనే సందేహాలతోనూ ప్రచురితమయ్యాయి. సాగునీళ్లు అన్ని ప్రాంతాల రైతులకు జీవనాడి అయినప్పుడు ఏపీలో ఎందుకు 'జలహారతి' ఇస్తూ ఉత్సవాలు చేసుకుంటున్నారు? తెలంగాణలో ఎందుకు నిందలు వేస్తున్నారు? వ్యయం-ప్రయోజనాల విశ్లేషణ, విద్యుత్ భారం, నదీ బేసిన్ల వెలుపల నీటిని మళ్లించడం, సంబంధిత చట్టాలు లాంటి ప్రశ్నలను ఏపీ విషయంలో చాలా అరుదుగా లేవనెత్తుతారు. కానీ, తెలంగాణ విషయంలో మాత్రం రైతుల ప్రయోజనాలను విస్మరించేందుకు కూడా సాహసిస్తున్నారు. అధికారంలో ఉన్నవారిపై ఆరోపణలు చేయడం, సర్కారుపై నిందలు వేయడం మొదలుకొని వాతావరణ మార్పుల వరకు వివిధ రకాల కథనాలను ఎలాంటి తడబాటు లేకుండా వ్యాప్తి చేస్తున్నారు.

తెలంగాణలో మీడియా కథనాల్లో సాగు విస్తీర్ణం, వరి సాగు వల్ల కార్బన్ ఉద్గారాల విడుదల గురించిన ఆందోళనలు, ఎకరం పంట పండించేందుకు అధిక సాగునీటి ఖర్చు, నీళ్లను ఎత్తిపోసేందుకు అత్యధిక విద్యుత్తు వ్యయం లాంటి అంశాలే ఎక్కువగా కనిపిస్తాయి. ఈ కథనాలు చివరికి వరిపై ఎక్కువ నీళ్లను వాడే పంటగా ముద్రవేసేంత వరకు, వరి సాగును తగ్గించాలని సూచించేంత వరకు వెళ్లాయి రాష్ట్ర విభజన జరగకపోయి ఉంటే, తెలంగాణ రైతులకు వ్యవసాయం చేయడం తెలియదని, అందువల్ల వారికి సాగునీరు అవసరం లేదని సూచించే స్థాయికీ ఈ కథనాలు వెళ్లేవి. కానీ, వాస్తవానికి ఐదేండ్లలోనే వడ్ల ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లిన తెలంగాణ రైతుల సామర్థ్యాన్ని ఈ ప్రపంచం చూసింది. నిజానికి తెలంగాణ రైతులు వరి సాగు చేయకుండా నిరుత్సాహపరచాలని కొంతమంది మేధావులుగా చెప్పుకొనేవారు ప్రయత్నించారు. డయాబెటిస్ కారణంగా ప్రజలు అన్నం తినడం లేదని, అందువల్ల తెలంగాణ రైతులకు సాగునీరు అందించే ప్రయత్నాలు అనవసరమని ప్రచారం చేశారు. ప్రధాన మీడియా సంస్థల మద్దతు ఉంటే ఎలాంటి నెరేటివ్‌ను అయినా సులువుగా ప్రచారం చేయవచ్చని అనడానికి ఇదే నిదర్శనం. పండించిన ధాన్యాన్ని పూర్తిగా వినియోగించే ఇతర మార్గాలను ప్రభుత్వం వెతకాలే తప్ప, వరి సాగు చేయవద్దని చెప్తారా? అని తెలంగాణ రైతులు ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. పప్పు, కూరగాయలు, పండ్ల వంటి పంటలకూ వరికి ఇచ్చినట్టే మద్దతిస్తే, రైతులు ఇతర పంటలు పండించేందుకు సంకోచించరు.

ఇక అసలు విషయానికి వస్తే, ఏపీలో సాగునీటి కోసం అక్కడి ప్రభుత్వం చేపట్టిన చర్యలు, తొలి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలకు మధ్య వ్యత్యాసాలేమీ లేవు. ఈ రెండు రాష్ట్రాలు కరువు పీడిత ప్రాంతాలకు నీళ్లను తీసుకెళ్లేందుకు కష్టపడుతున్నాయి. అయితే, ఈ సారూప్యత ఇక్కడితోనే ముగుస్తుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రైతులు మూడు కీలకమైన అంశాలను లేవనెత్తుతున్నారు. మొదటిది, తమ రాష్ట్రంలోని ప్రాజెక్టుల కోసం శ్రీశైలం జలాశయం నుంచి 'వరద లేదా మిగులు' జలాలను ఉపయోగిస్తున్నామని ఏపీ చెప్తున్నది. కానీ, తెలంగాణ రైతులు ఈ వాదనను ఖండిస్తున్నారు.

# ఐటీ ఉద్యోగులకు ఏఐ సెగ.. నేర్చుకోకుంటే ఇంటికే!

**ఐటీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో ఉద్యోగాల కోత**

**ఈ ఏడాది 10,000 మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం**

**ఏఐ నైపుణ్యాలు నేర్చుకోవాలని ఉద్యోగులకు టెక్ కంపెనీల హెచ్చరిక**

**గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లలో మాత్రం కొనసాగుతున్న నియామకాలు**

**ఫ్రెషర్ల నియామకాల్లో నైపుణ్యాలకే పెద్దపీట**




భారత ఐటీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పెను మార్పులకు కారణమవుతోంది. ఒకవైపు ఉత్పాదకత పెంచడానికి కంపెనీలు ఏఐని వేగంగా అమలు చేస్తుంటే, మరోవైపు సంప్రదాయ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతోంది. ఈ ఏడాది ఏఐ ఆటోమేషన్ కారణంగా 10,000 మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని తాజా అంచనాలు హెచ్చరిస్తున్నాయి.ఏఐ టూల్స్ వాడకంపై నైపుణ్యం పెంచుకోవాలని, లేదంటే పోటీలో వెనుకబడిపోతారని గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు తమ ఉద్యోగులకు స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నాయి. పనితీరు సమీక్షల్లో కూడా ఏఐ వినియోగాన్ని ఒక కొలమానంగా పరిగణిస్తున్నట్టు తెలుస్తోంది. ఏఐ వల్ల ఉత్పాదకత పెరుగుతుండటంతో, తక్కువ మంది సిబ్బందితో ఎక్కువ పని చేయగలుగుతున్నామని కంపెనీలు భావిస్తున్నాయి. గతేడాది కూడా టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలు వేల మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే.ఈ ప్రభావం ఫ్రెషర్ల నియామకాలపైనా పడింది. ఒకప్పుడు భారీగా ఉద్యోగాలిచ్చిన కంపెనీలు, ఇప్పుడు ఏఐ, క్లౌడ్, డేటా అనలిటిక్స్ వంటి ప్రత్యేక నైపుణ్యాలు ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. అయితే, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) మాత్రం కొంత ఆశాకిరణంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది జీసీసీలు దాదాపు 1.2 లక్షల నుంచి 1.4 లక్షల మందిని నియమించుకునే అవకాశం ఉంది.మొత్తంమీద, ఐటీ రంగంలో నిలదొక్కుకోవాలంటే కొత్త టెక్నాలజీలను నేర్చుకోవడం తప్పనిసరి అని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. కేవలం డిగ్రీ ఉంటే సరిపోదని, ఏఐ ఆధారిత నైపుణ్యాలు పెంచుకున్న వారికే భవిష్యత్తు ఉంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# వింటర్ ఒలింపిక్స్‌లో వింత సమస్య... కండోమ్‌లకు కరవు!

**మిలాన్ వింటర్ ఒలింపిక్స్‌లో కండోమ్‌లకు తీవ్ర కొరత**

**మూడు రోజుల్లోనే 10 వేల ప్యాకెట్ల స్టాక్ పూర్తి**

**అథ్లెట్ల నుంచి ఊహించని డిమాండ్‌తో తలెత్తిన సమస్య**

**కొత్త స్టాక్ కోసం ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు**



ఇటలీలోని మిలాన్-కోర్టినాలో జరుగుతున్న 2026 వింటర్ ఒలింపిక్స్‌లో ఒక చిత్రమైన సమస్య తలెత్తింది. క్రీడా గ్రామంలో అథ్లెట్ల కోసం ఉచితంగా ఏర్పాటు చేసిన కండోమ్‌ల స్టాక్ కేవలం మూడు రోజుల్లోనే పూర్తిగా అయిపోయింది. దీంతో నిర్వాహకులు వెంటనే కొత్త స్టాక్ కోసం పరుగులు పెట్టాల్సి వచ్చింది.ఒలింపిక్స్ ప్రారంభమయ్యాక నిర్వాహకులు సుమారు 10 వేల కండోమ్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అయితే, 92 దేశాల నుంచి వచ్చిన దాదాపు 2,900 మంది అథ్లెట్లు ఉన్న క్రీడా గ్రామంలో ఈ నిల్వలు చాలా వేగంగా ఖాళీ అయ్యాయి. సరఫరా కేవలం మూడు రోజుల్లోనే అయిపోయిందని, కొత్త స్టాక్ ఎప్పుడొస్తుందో తెలియదని ఓ అథ్లెట్ చెప్పినట్లు ఇటాలియన్ మీడియా 'లా స్టాంపా' తన కథనంలో పేర్కొంది.సాధారణంగా ఒలింపిక్స్‌లో అథ్లెట్లకు ఉచితంగా కండోమ్‌లు అందించడం 1988 సియోల్ ఒలింపిక్స్ నుంచి వస్తున్న సంప్రదాయం. సురక్షిత శృంగారాన్ని ప్రోత్సహించడం, ఎ×ఐ/హూ×ఐూ వంటి వ్యాధుల నివారణ దీని ముఖ్య ఉద్దేశం. గత 2024 పారిస్ సమ్మర్ ఒలింపిక్స్‌లో 10,500 మంది అథ్లెట్ల కోసం 3 లక్షలకు పైగా కండోమ్‌లను అందించారు. అయితే, వింటర్ ఒలింపిక్స్‌లో అథ్లెట్ల సంఖ్య తక్కువగా ఉండటంతో ఈసారి తక్కువ స్టాక్ తెచ్చారు.అయితే, అథ్లెట్ల నుంచి ఊహించని స్థాయిలో డిమాండ్ రావడంతో ఈ 'కండోమ్ క్రైసిస్' ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు నిర్వాహకులు వెంటనే రంగంలోకి దిగారు. త్వరలోనే కొత్త స్టాక్‌ను క్రీడా గ్రామానికి తరలించి, ఒలింపిక్స్ ముగిసే వరకు కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

# అంబానీ ఇంట పెళ్లి సందడి.. ఎవరీ విక్రమ్ సల్గావ్కర్?

**ధీరూభాయ్ అంబానీ తొలి మనవడు విక్రమ్ సల్గావ్కర్ వివాహం**

**ముంబైలో ఘనంగా జరిగిన వేడుకలో సందడి చేసిన అంబానీ కుటుంబం**

**మేనల్లుడి బరాత్‌లో డ్యాన్స్ చేస్తూ కనిపించిన ముకేశ్ అంబానీ**

**శ్వేనా పోయ్ రైతుర్కర్‌ను పెళ్లి చేసుకున్న విక్రమ్ సల్గావ్కర్**

**సాధారణంగా ప్రచారానికి దూరంగా ఉండే సల్గావ్కర్ కుటుంబంపై ఆసక్తి**



పారిశ్రామిక దిగ్గజం అంబానీ కుటుంబంలో మరో పెళ్లి వేడుక అందరి దృష్టిని ఆకర్షించింది. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ మేనల్లుడు, దివంగత ధీరూభాయ్ అంబానీ తొలి మనవడు అయిన విక్రమ్ సల్గావ్కర్ వివాహం ముంబైలో అంగరంగ వైభవంగా జరిగింది. శ్వేనా పోయ్ రైతుర్కర్‌ను ఆయన వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లితో, సాధారణంగా ప్రచారానికి దూరంగా ఉండే విక్రమ్ గురించి తెలుసుకునేందుకు అందరూ ఆసక్తి చూపుతున్నారు.ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకకు అంబానీ కుటుంబ సభ్యులు హాజరై సందడి చేశారు. పెళ్లికొడుకుగా విక్రమ్ తెల్లటి రోల్స్ రాయిస్ కారులో వేదిక వద్దకు చేరుకోగా, మేనల్లుడి బారాత్‌లో ముకేశ్ అంబానీ డ్యాన్స్ చేస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ వివాహానికి సచిన్ టెండూల్కర్, ఉదయ్ కోటక్, విధు వినోద్ చోప్రా వంటి ప్రముఖులు హాజరయ్యారు.విక్రమ్.. ముకేశ్ అంబానీ సోదరి దీప్తి, గోవాకు చెందిన వ్యాపారవేత్త దత్తరాజ్ సల్గావ్కర్‌ల కుమారుడు. అమెరికాలోని వార్టన్ స్కూల్‌లో చదివిన ఆయన ప్రస్తుతం తమ కుటుంబానికి చెందిన సల్గావ్కర్ గ్రూప్ హోటల్స్ వ్యాపారాలను చూసుకుంటున్నారు. వధువు శ్వేనా పార్సన్స్ స్కూల్ ఆఫ్ డిజైన్‌లో చదువుకున్నారు. ఆకాశ్ అంబానీ భార్య శ్లోకా మెహతా కుటుంబానికి చెందిన 'రోసీ బ్లూ' జ్యువెలరీ సంస్థలో ఆమె గతంలో పనిచేశారు.అంబానీ కుటుంబంలోని ఇతర సభ్యులతో పోలిస్తే, సల్గావ్కర్ కుటుంబం చాలా అరుదుగా మాత్రమే బహిరంగ కార్యక్రమాల్లో కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో విక్రమ్ వివాహం జాతీయ మీడియా దృష్టిని విశేషంగా ఆకర్షించింది.

# 'ఏఐ' ఎఫెక్ట్... స్టాక్ మార్కెట్లకు భారీ నష్టాలు

**వరుసగా రెండో రోజు భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**


**1,048 పాయింట్లు పతనమైన సెన్సెక్స్**

**336 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**భారత ఔట్‌సోర్సింగ్ మోడల్‌పై ఏఐ ప్రభావం చూపుతుందనే ఆందోళనలే కారణం**

**అన్ని రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి, మెటల్ షేర్లు అత్యధికంగా పతనం**

**కీలక స్థాయిల దిగువకు పడిపోయిన నిఫ్టీ**



భారత ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా భారీ నష్టాల్లో ముగిశాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో అమ్మకాల సునామీ వెల్లువెత్తడంతో సూచీలు కుప్పకూలాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కారణంగా భారత ఔట్‌సోర్సింగ్ మోడల్‌కు ముప్పు వాటిల్లుతుందనే అంతర్జాతీయ ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి.ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1,048 పాయింట్లు నష్టపోయి 82,626 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 336 పాయింట్లు పతనమై 25,471 వద్ద ముగిసింది. బెంచ్‌మార్క్ సూచీలతో పాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.71 శాతం పడిపోగా, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.79 శాతం మేర క్షీణించింది.రంగాల వారీగా చూస్తే అన్ని సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ముఖ్యంగా నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3.31 శాతం పతనమై టాప్ లూజర్‌గా నిలిచింది. రియల్టీ, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా భారీ నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ 50లోని 44 షేర్లు నష్టాల్లో ముగియడం మార్కెట్ బలహీనతను సూచిస్తోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 6 పైసలు బలహీనపడి 90.61 వద్ద ట్రేడ్ అయింది.సాంకేతికంగా నిఫ్టీ తన కీలకమైన 21, 50, 100-రోజుల చలన సగటుల దిగువకు పడిపోయిందని విశ్లేషకులు తెలిపారు. "బ్యాంక్ నిఫ్టీ స్వల్పకాలిక కన్సాలిడేషన్ రేంజ్ నుంచి కిందకి జారింది. ఇది స్వల్ప లాభాల స్వీకరణను సూచిస్తుంది. అయితే, 59,700 వద్ద ఉన్న 20-రోజుల చలన సగటు కీలక మద్దతుగా కొనసాగుతోంది" అని ఎల్కేపీ సెక్యూరిటీస్ టెక్నికల్ అనలిస్ట్ వత్సల్ భువా వివరించారు.

## వెనెజువెలా చమురు కొనేందుకు రిలయన్స్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన అమెరికా

**రిలయన్స్ తక్కువ ధరకు చమురును దిగుమతి చేసుకునే అవకాశం**

**అధికారిక ప్రకటన విడుదల చేయని రిలయన్స్**

**వెనెజువెలా చమురు రంగంపై ఆంక్షలను సడలిస్తున్న అమెరికా**




రిలయన్స్ ఇండస్ట్రీస్ వెనెజువెలా నుంచి ముడి చమురు కొనుగోలు చేసేందుకు అమెరికా ప్రభుత్వం లైసెన్స్ మంజూరు చేసింది. ఈ క్రమంలో తక్కువ ధరకు చమురును దిగుమతి చేసుకునే అవకాశం కంపెనీకి లభించింది. ఇప్పటికే పలువురు అంతర్జాతీయ ట్రేడర్లు ఈ అనుమతిని పొందగా, తాజాగా భారత్‌కు చెందిన ప్రైవేటు సంస్థ అయిన రిలయన్స్‌కు కూడా లైసెన్స్ లభించింది. అయితే, ఈ విషయంపై రిలయన్స్ నుంచి ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాలేదు.కొన్ని రోజుల క్రితం వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోపై అమెరికా ప్రభుత్వం చర్యలు తీసుకుని, ఆ దేశ చమురు రంగంపై ఆంక్షలు విధించింది. అనంతరం ఆ ఆంక్షలను సడలిస్తూ, అక్కడి చమురును విక్రయించేందుకు వ్యాపారులకు అనుమతులు ఇచ్చింది. అయితే, 2019-20లో అమెరికా ఆంక్షలు అమల్లోకి రావడానికి ముందు కూడా రిలయన్స్ వెనెజువెలా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకునేది.

## 365 డేస్ రీచార్జ్ ప్లాన్ తీసుకువచ్చిన బీఎస్ఎన్ఎల్

**మరో వార్షిక రీచార్జి ప్లాన్‌ను ప్రకటించిన బీఎస్ఎన్ఎల్**

**ఎక్కువ డేటా అవసరమయ్యే కస్టమర్ల కోసం రూ.2799 ప్లాన్**

**రోజుకు 3 జీబీ డేటాతో పాటు అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చిన బీఎస్ఎన్ఎల్**




ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల కోసం మరో వార్షిక రీఛార్జ్ ప్లాన్‌ను ప్రకటించింది. ఇటీవల రూ.2626 యాన్యువల్ ప్లాన్‌ను ప్రవేశపెట్టిన సంస్థ, ఇప్పుడు ఎక్కువ డేటా అవసరమయ్యే కస్టమర్ల కోసం రూ.2799 ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.2799 వార్షిక ప్లాన్ వివరాల్లోకి వెళితే.. రోజుకు 3 జీబీ డేటాతో పాటు అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చు. ఈ ప్యాక్ వ్యాలిడిటీ 365 రోజులు. ఎక్కువ డేటా వినియోగించే వారికి ఈ ప్లాన్ ఉపయోగకరంగా ఉంటుంది. ఇక 'దేశ్ కా నెట్‌వర్క్, దేశ్ కా భరోసా' అంటూ ప్రచారం చేస్తున్న ఈ ప్లాన్ కోసం వినియోగదారులు రూ.2626తో రీఛార్జ్ చేసుకోవాలి. 365 రోజుల వరకు చెల్లుబాటు అయ్యే ఈ ప్లాన్ ద్వారా రోజుకు 2.6 జీబీ డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చు. అపరిమిత కాల్స్ యథావిధిగా లభిస్తాయి. అయితే, ఈ ప్రత్యేక ఆఫర్ ఫిబ్రవరి 24 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని సంస్థ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా తెలిపింది.

## బంగారం ధరలు భారీగా పెరిగాయి

**ఎంత పెరిగియా తెలిస్తే కొనుగోలు బంద్ చేస్తారు**

బంగారం ధరలు సామాన్యులకు అంతు చిక్కడం లేదు. ఎప్పుడు ఎలా మారుతాయో తెలియడం లేదు. గతేడాది భారీగా పెరిగిన పసిడి ధరలు ఈ ఏడాది వచ్చే సరికి కాస్త తగ్గుముఖం పట్టాయి. జనవరి నెలలో చుక్కలు చూపించిన బంగారం ధరలు ఫిబ్రవరి వచ్చేసరికి నేల చూపులు చూశాయి. సామాన్యులు బంగారం కొనుగోలు చేయాలంటేనే హడలిపోయే పరిస్థితి కనిపిస్తోంది. అంతర్జాతీయంగా పరిస్థితులు ఇంకా సద్దుమణిగినట్లు కనిపించకపోవడంతో బంగారం ధరలు పెరిగే సూచనలు కూడా కనిపిస్తున్నాయి. డాలర్ పుంజుకుంటే తప్ప బంగారం ధరలు తగ్గేలా కనిపించడం లేదు. ఈ రోజు బంగారం ధరలను చూస్తే భారీగానే పెరిగాయని చెప్పవచ్చు. ఫిబ్రవరి 14, శనివారం దేశంలో బంగారం ధరలను పరిశీలిస్తే..24 క్యారట్ల గ్రాము ధర రూ.197 పెరిగి రూ.15,775 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.180 పెరిగి రూ.14,460 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.147 పెరిగి రూ.11,831 వద్ద ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.19,700 పెరిగి రూ.15,77,500 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ. 18,000 పెరిగి రూ. 14,46,000 వద్ద ట్రేడ్ అవుతోంది. 18 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.14,700 పెరిగి రూ.11,83,100 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ నగరంలో బంగారం ధరలను ఓ సారి పరిశీలిస్తే.. 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,970 పెరిగి రూ.1,57,750 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ. 1,800 పెరిగి రూ.1,44,600 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,470 పెరిగి రూ.1,18,310 గా నమోదైంది. విజయవాడ నగరంలో బంగారం ధరలను ఓ సారి పరిశీలిస్తే.. 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,970 పెరిగి రూ.1,57,750 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ. 1,800 పెరిగి రూ.1,44,600 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,470 పెరిగి రూ.1,18,310 గా నమోదైంది. చెన్నైలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,58,840 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,45,600 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,24,500 గా నమోదైంది. ముంబై నగరంలో నేడు బంగారం ధరలను ఓ సారి పరిశీలిస్తే..10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,970 పెరిగి రూ.1,57,750 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ. 1,800 పెరిగి రూ.1,44,600 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,470 పెరిగి రూ.1,18,310 గా నమోదైంది. బంగారం ధరలు సడన్‌గా ఎందుకు కుప్పకూలాయి.. కొనుగోలుకు ఇది సరైన సమయమేనా.. నిపుణులు సూచన ఏంటంటే.. ఇక ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,57,900 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,44,750 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,18,460 గా నమోదైంది. ఇక అహమ్మదాబాద్ లో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,57,800 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల ధర రూ.1,44,650 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,18,360 గా నమోదైంది. మీ ఏరియాలో బంగారం ధరలు తెలుసుకోవాలనుకుంటే ఈ లింక్ మీద క్లిక్ చేసి తెలుసుకోవచ్చు బెంగళూరు నగరంలో బంగారం ధరలను ఓ సారి పరిశీలిస్తే..10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,970 పెరిగి రూ.1,57,750 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ. 1,800 పెరిగి రూ.1,44,600 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,470 పెరిగి రూ.1,18,310 గా నమోదైంది. కలకత్తా నగరంలో ధరలను ఓ సారి పరిశీలిస్తే..10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,970 పెరిగి రూ.1,57,750 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ. 1,800 పెరిగి రూ.1,44,600 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,470 పెరిగి రూ.1,18,310 గా నమోదైంది. విశాఖ నగరంలో బంగారం ధరలను ఓ సారి పరిశీలిస్తే..10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1200 పెరిగి రూ.1,58,400 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ. 1,100 పెరిగి రూ.1,45,210 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.900 పెరిగి రూ.1,18,800 గా నమోదైంది.





# 'జైలర్ 2' రిలీజ్‌పై సందిగ్ధం.. ఆగస్ట్‌లో నానితో బాక్సాఫీస్ పోటీ తప్పదా?

తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా వచ్చిన పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జైలర్ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ రూపొందించిన ఈ చిత్రం దాదాపు రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించి తలైవా కెరీర్‌లోనే బెస్ట్ హిట్స్‌లో ఒకటిగా నిలిచింది. దీంతో ఇప్పుడు సీక్వెల్ 'జైలర్ 2' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదట ఈ సినిమాను జూన్ 12న విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం రిలీజ్ వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. షూటింగ్ చివరి దశలో ఉండగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు, ప్రమోషన్స్ వంటి కారణాలతో విడుదల తేదీ మారవచ్చని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారన్న టాక్ వినిపిస్తున్నప్పటికీ, అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. ఈ సీక్వెల్‌లో మొదటి భాగంలో నటించిన కీలక తారాగణమే మళ్లీ కనిపించనున్నారు. రజనీకాంత్‌కు జోడిగా రమ్యకృష్ణ నటించగా, ముఖ్య పాత్రల్లో ఎస్ జే సూర్య, యోగి బాబు, మోహన్ లాల్, జాకీ ష్రాఫ్, శివరాజ్ కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తుండగా, సన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.మొదటి భాగంలో విగ్రహాల దొంగల ముఠాతో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ కుటుంబానికి ఎదురైన సమస్యలు, ఆ ముఠా నాయకుడితో జరిగిన తలపడి కథ ముగిసింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు సీక్వెల్‌లో చూపించనున్నట్లు సమాచారం. ఇక ఆగస్ట్ 21 రిలీజ్ టాక్ నేపథ్యంలో బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే రోజున నేచరల్ స్టార్ నాని నటిస్తున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా ది ప్యారడైజ్ కూడా విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో పలుభాషల్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఒకవేళ రెండు సినిమాలు ఒకే రోజున విడుదలైతే బాక్సాఫీస్ వద్ద హీట్ పెరగడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# 'డాన్ 3'లో నేను లేను.. క్లారిటీ ఇచ్చిన హృతిక్ రోషన్

బాలీవుడ్ యాక్షన్ ఫ్రాంచైజీ 'డాన్ 3' చుట్టూ గత కొద్దిరోజులుగా సాగుతున్న ఉత్కంఠకు స్టార్ హీరో హృతిక్ రోషన్ ఎట్టకేలకూ తెరదించారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ నుంచి రణ్‌వీర్ సింగ్ తప్పుకున్న అనంతరం ఆయన స్థానంలో హృతిక్ నటించబోతున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగిన విషయం తెలిసిందే. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని హృతిక్ స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం చిత్ర బృందం తనను ఎప్పుడూ సంప్రదించలేదని, కేవలం పుకార్ల ఆధారంగానే ఇలాంటి వార్తలు పుట్టుకొస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రకటన వెలువడే వరకు ఇటువంటి నిర్ధారణ లేని వార్తలను ప్రసారం చేయవద్దని ఆయన మీడియాకు విజ్ఞప్తి చేస్తూ, అనవసరపు చర్చలకు ముగింపు పలికారు. అసలు ఈ వివాదం రణ్‌వీర్ సింగ్ ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారనే వార్తలతో మొదలైంది. రణ్‌వీర్ తప్పుకోవడం వల్ల తమకు సుమారు రూ. 40 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని నిర్మాతలు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడ్యూసర్స్ గిల్డ్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. అయితే, సరైన స్క్రిప్ట్ సిద్ధంగా లేకపోవడం వల్లే రణ్‌వీర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.





# రెండున్నరేళ్లు గడిచిపోయాయి.. ఈ ఏడాదైనా వస్తుందా?

ఎంత పెద్ద స్టార్ హీరో అయినా సరే కొన్నిసార్లు సినిమా కష్టాలు తప్పవు. చిరంజీవి 'విశ్వంభర' సరిగ్గా ఇలాంటి స్థితిలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే ఈ మూవీ ఒకటుందని జనాలు ఇప్పటికే మర్చిపోయారు. మూవీ టీమ్ నుంచి కూడా ఎలాంటి అప్‌డేట్ లేదు. అసలు ఈ చిత్రం ఈ ఏడాదైనా రిలీజ్ అవుతుందా? ఇంతకీ అసలేం జరుగుతోంది? 'బింబిసార' లాంటి సక్సెస్ తర్వాత వశిష్ఠ.. చిరంజీవితో కలిసి కొత్త మూవీ చేసేందుకు సిద్ధమయ్యాడు. 2023లో చిరు పుట్టినరోజు సందర్భంగా ప్రాజెక్టుని ప్రకటించారు. అక్టోబరు నుంచి షూటింగ్ కూడా మొదలుపెట్టారు. 2024లో ఎప్పుడైతే గ్లింప్స్ పేరిట ఓ వీడియో వదిలారో అప్పటి నుంచి కష్టాలు మొదలయ్యాయి. గ్లింప్స్‌పై విపరీతమైన ట్రోలింగ్, విమర్శలు వచ్చాయి. దెబ్బకు మూవీ టీమ్‌కి సీన్ అర్థమైపోయింది. గతేడాది ఓ పాట, కొత్త గ్లింప్స్ అని మరికొన్ని అప్‌డేట్స్ వచ్చాయి గానీ పెద్దగా వర్కౌట్ కాలేదు. బజ్ రాలేదు. మరోవైపు దీని తర్వాత చాన్నాళ్లకు అనిల్ రావిపూడితో చిరంజీవి ఓ సినిమా ప్రకటించారు. 'మన శంకరవరప్రసాద్' పేరుతో గత నెలలో సంక్రాంతికి రిలీజ్ చేస్తే అద్భుతమైన హిట్ కొట్టింది. ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో కొత్త మూవీ చేసేందుకు చిరు రెడీ అయిపోతున్నారు. మెగా ఫ్యాన్స్ కొత్త ప్రాజెక్టు గురించి ఆనందపడిపోతున్నారు. దీని గురించి రూమర్స్ చాలానే వస్తున్నాయి. ఇది కూడా వచ్చే ఏడాది సంక్రాంతి టార్గెట్‌గా తీస్తున్నారని అంటున్నారు. అదే టైంలో 'విశ్వంభర' గురించి చిన్న సౌండ్ కూడా లేదు. తాజాగా 'విశ్వంభర' నిర్మాతలే తీసిన 'కపుల్ ఫ్రెండ్లీ' విడుదల సందర్భంగా నిర్మాతలు.. చిరు సినిమా గురించి మాట్లాడట్లేదు. 'కపుల్ ఫ్రెండ్లీ' టీమ్‌తో ప్రమోషనల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు వశిష్ఠ కూడా 'విశ్వంభర' రిలీజ్ గురించి త్వరలో చెబుతాం అంటున్నాడే తప్ప ఈ ఏడాది వస్తుందా కనీసం వచ్చే ఏడాది వస్తుందా లాంటివి క్లారిటీ ఇవ్వట్లేదు. చూస్తుంటే గ్రాఫిక్స్ విషయంలో ఇంకా సందిగ్ధత అలానే కొనసాగుతున్నట్లు రూమర్స్ వస్తున్నాయి. ఆ రిపేర్లు ఎప్పుడు పూర్తవుతాయో? బొమ్మ ఎప్పుడు బయటకు వస్తుందనేది అంతుచిక్కని ప్రశ్నలా మారిపోయింది?



# బ్రేకప్‌పై సాయి ధరమ్ తేజ్ సరదా కామెంట్స్ వైరల్ హీరోయిన్ ఎవరోనంటూ నెటిజన్ల ఆరా

మెగా హీరో సాయి ధరమ్ తేజ్ తాజాగా చేసిన బ్రేకప్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. యంగ్ హీరో సుహాస్ నటిస్తున్న తాజా చిత్రం హే భగవాన్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న తేజు, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక సరదా వ్యాఖ్యతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ ఈవెంట్‌లో దర్శకుడు రామ్ అబ్బరాజు కూడా హాజరుకావడంతో స్టేజ్‌పై జరిగిన సంభాషణ మరింత వినోదంగా మారింది. తేజు మాట్లాడుతూ తన లవ్ స్టోరీ బ్రేకప్ కావడానికి కారణం రామ్ అబ్బరాజునేనని నవ్వుతూ చెప్పడంతో ఆడిటోరియంలో నవ్వులు పూశాయి. రామ్ అబ్బరాజు కూడా అదే సరదా టోన్‌లో స్పందిస్తూ "ఆవిడ ఒక హీరోయిన్‌డ ఆమె భాష కూడా మాకు రాదు" అంటూ హింట్ ఇవ్వడంతో అక్కడ ఉన్నవాళ్లు కాసేపు షాక్ అయ్యి వెంటనే నవ్వుల్లో మునిగిపోయారు. వీరిద్దరి మధ్య ఉన్న స్నేహం, చనువు ఈ సంభాషణలో స్పష్టంగా కనిపించింది. రామ్ అబ్బరాజు అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పటి నుంచే సాయి ధరమ్ తేజ్‌తో పరిచయం ఉండటంతో, ఈ జోకులు పూర్తిగా ఫ్రెండ్లీ వాతావరణంలోనే జరిగినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ తేజు చెప్పిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. "అసలు ఆ హీరోయిన్ ఎవరు?" అనే ప్రశ్న ఇప్పుడు నెటిజన్లలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం నలభై ఏళ్లకు చేరుకున్న సాయి ధరమ్ తేజ్ ఇంకా వివాహం చేసుకోకపోవడం కూడా ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. గతంలో ఆయనపై వచ్చిన కొన్ని రూమర్లు మళ్లీ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. అయితే ఈ వ్యాఖ్యలు పూర్తిగా సరదా కోణంలో చెప్పినవేనని ఆయన అభిమానులు అంటున్నారు. ఏదేమైనా ఒక సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో జరిగిన ఈ చిన్న కామెడీ సంభాషణ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తేజు స్టేజ్‌పై చేసిన ఒకే ఒక్క జోక్ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద డిబేట్‌గా మారడం విశేషమే.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.